WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 49 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | బుధవారం 18 ఫిబ్రవరి 2026 | వెల : 2-00



## సిద్ధార్థ్‌రెడ్డికి జైలు

- నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు
- 4 వారాల్లో లొంగిపోవాల్సిందే.. సిద్ధార్థ్ రెడ్డి అప్పీల్ కొట్టివేత
- గొంతు నులిమి చంపలేదని, అత్యాచారం జరగలేదని స్పష్టీకరణ
- కానీ.. 'మ్యూచువల్ సూసైడ్ ప్యాక్ట్'లో బతికిన వాడిదే బాధ్యతని వెల్లడి
- పోస్టుమార్టం చేసిన డా. మునిస్వామి తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

2



## ఒకే ఫైలు.. ఒకే సంతకం.. వేర్వేరు న్యాయమా?

- అందరూ నిర్దోషులు.. నేనే నిందితురాలినా?
- మంత్రులు, మాజీలు బయటపడ్డారు.. నాపైనే విచారణ ఎందుకు?
- కేంద్రం చెప్పిందే చేశా.. నిబంధనలు మీరలేదు
- సుప్రీంకోర్టుకు నివేదించిన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి
- శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు



# తీరంలో యుద్ధ నౌకల జాతర

- రాష్ట్రపతి విందుతో లాంఛనంగా ప్రారంభమైన ఐఎఫ్ఆర్
- నేడు ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణించనున్న ద్రౌపదీ ముర్ము
- ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం ఐఎన్ఎస్-సుమేధ నౌకపై రాష్ట్రపతి ప్రయాణిస్తారు
- ఆరు వరుసల్లో నిలిపిన 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు



విశాఖపట్నం, స్వర్ణసాగరం

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విశాఖ ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్‌లో విందు (ప్రెసిడెన్షియల్ బాంక్వెట్) ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ఉత్సవానికి హాజరవుతున్న వివిధ దేశాల నేవీ చీఫ్‌లకు దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ. ఈ విందుతో ఐఎఫ్ఆర్ లాంచనంగా ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ రోషిణి అపరంజి, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ నేవల్ అధికారులు, ఫ్లీట్ కమాండర్లు, డీజీసీజీ, సీజీసీ(ఈఎస్), ఇతర కమాండర్లతో రాష్ట్రపతి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు స్వాగతం పలికారు. ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం ఐఎన్ఎస్-సుమేధ నౌకపై రాష్ట్రపతి ప్రయాణిస్తారు. ఆరు వరుసల్లో నిలిపిన 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం నౌకా దళం నిర్వహించిన తుది సన్నాహక విన్యాసాలను నేవీ చీఫ్ అడ్మిరల్

- మిగతా3లో

## హవాయిలో బద్దలైన అగ్నిపర్వతం



5

- 1,300 అడుగులకు పైగా ఎగిసిపడ్డ లావా
- ఆకట్టుకుంటున్న కళ్లు చెదిరే రాత్రి దృశ్యాలు

## ద్వైపాక్షిక బంధం... గ్లోబల్ స్థాయికి..

- భారత్, ఫ్రాన్స్ నిర్ణయం
- మాక్రాన్--మోదీ కీలక చర్చలు
- 21 ఒప్పందాలపై సంతకాలు
- ప్రపంచం ప్రస్తుతం అత్యంత అస్థిర దశ గుండా సాగుతోంది
- పరిస్థితుల్లో స్థిరత్వ స్థాపనలో భారత్, ఫ్రాన్స్ భాగస్వామ్యం కీలకపాత్ర

2



# శ్రీవారి సొమ్ము దోపిడీకి ఇందాపూర్ ముసుగు

**ఇది సీఎం చంద్రబాబు మరో స్కామ్**

**మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపాటు**



- ఆ డెయిరీ పేరుతో హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు కుట్ర
- టీటీడీ నెయ్యి కాంట్రాక్ట్ దక్కించుకునే కుతంత్రం
- అందుకే లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడారంటూ నిందలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు, దుష్ప్రచారం
- హెరిటేజ్ వెబ్‌సైట్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ఇందాపూర్ డెయిరీ

అమరావతి, స్వర్ణసాగరం

చంద్రబాబు మరో స్కామ్ ఇందాపూర్ డెయిరీ అని, ఆ డెయిరీ పేరుతో హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు ఆయన కుట్ర చేశారని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. హెరిటేజ్.. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్ దక్కించుకునే కుతంత్రం చేసిన చంద్రబాబు, తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడారని నిందలు వేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. అయితే ఇందాపూర్ డెయిరీ వ్యవహారంతో చంద్రబాబు కుట్ర బట్టబయలు అయిందని, అందుకే సభలో తాము చర్చకు పట్టుబడితే ప్రభుత్వం పారిపోయిందన్నారు. మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీ

- మిగతా3లో

# మండలిలో వైసీపీ రచ్చ!

- హెరిటేజ్‌పై చర్చకు పట్టు.. గంటల తరబడి నినాదాలు
- ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు
- సంబంధం లేని అంశాన్ని ప్రస్తావిస్తారా?: మంత్రుల ఆగ్రహం
- పలుమార్లు సభను వాయిదా వేసిన ఛైర్మన్
- హిందూ దేవుళ్లు, భక్తులపై జగన్ పగబట్టారు: అచ్చెన్న
- కల్తీ లడ్డూ పాపాన్ని దారి మళ్లించేందుకే: కొలుసు



అమరావతి, స్వర్ణసాగరం

సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందని ఆరోపిస్తూ మంగళవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు రగడ సృష్టించారు. మండలి ప్రారంభం కాగానే మైకుల్లో సాంకేతిక సమస్య కారణంగా సభను ఛైర్మన్ గంటసేపు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే.. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి

- మిగతా2లో

# ద్వైపాక్షిక బంధం... గ్లోబల్ స్థాయికి..

స్వర్ణసాగరం ముంబై

భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో నూతన శకానికి తెర లేచింది. అంతర్జాతీయంగా తీవ్ర అస్థిర పరిస్థితుల నేపథ్యంలో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. వాటిని 'ప్రత్యేక ప్రపంచ స్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యం'గా తీర్చిదిద్దుకోవాలని నిశ్చయించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ప్రధాని నరేంద్ర మోదీ నడుమ జరిగిన చర్చల్లో ఈ మేరకు కీలక ఒప్పందం కుదిరింది. రక్షణ, వర్తకం మొదలుకుని అరుదైన ఖనిజాల దాకా అన్ని రంగాల్లోనూ పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని నేతలు నిర్ణయించారు. ఈ దిశగా రక్షణ, అత్యంత అధునాతన టెక్నాలజీ, సంప్రదాయేతర ఇంధన వనరులు, ఆరోగ్యం తదితరాలకు సంబంధించి ఇరు దేశాల నడుమ 21 కీలక ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఫ్రెంచి రక్షణరంగ దిగ్గజం సఫ్రాన్ సంయుక్తంగా భారత్‌లో హమ్మర్ క్షిపణుల తయారీ, భారత, ఇరుదేశాల సైన్యంలో పరస్పరం అధికారుల నియామకం తదితరాలు వీటిలో ఉన్నాయి. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచి?చన మాక్రాన్‌తో మంగళవారం సాయంత్రం మోదీ ముంబైలో సమావేశమయ్యారు. పలు అంశాలపై ఇరువురూ లోతుగా చర్చించారు. భారత్--ఫ్రాన్స్ ద్వైపాక్షిక బంధాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని తీర్మానించారు. అనంతరం మోదీ, మాక్రాన్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

**కీలక భాగస్వామ్యం: మోదీ**

ప్రపంచం ప్రస్తుతం అత్యంత అస్థిర దశ గుండా సాగుతోందని మోదీ అభిప్రాయపడ్డారు.ఈ పరిస్థితుల్లో స్థిరత్వ స్థాపనలో భారత్, ఫ్రాన్స్ భాగస్వామ్యం కీలకపాత్ర పోషించగలదని విశ్వాసం వెలిబుచ్చారు. ఫ్రాన్స్ నైపుణ్యం, భారత వనరులు ఒక్కతాటిపైకి వస్తే అద్భుతాలు జరుగుతాయన్నారు. ఇరుదేశాలదీ ఎలాంటి హద్దులూ లేని ఆదర్శ భాగస్వామ్యం. ఇరు దేశాల మధ్య మొదటినుంచీ ప్రత్యేక సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయి"అని చెప్పారు. భారత్‌కు అత్యంత పురాతన వ్యూహాత్మక భాగస్వాముల్లో ఫ్రాన్స్ ఒకటని ఆయన గుర్తు చేశారు. "మాక్రాన్‌తో తాజా భేటీ ద్వారా ఈ బంధాన్ని ఎన్నడూ లేనంతగా ముందుకు తీసుకెళ్లాం. ఇరు దేశాలు పరస్పర విశ్వాసం, ఉమ్మడి విజన్‌తో కలసి సాగనున్నాయి. ఇది కేవలం వ్యూహాత్మక బంధం మాత్రమే కాదు. ప్రపంచ ప్రగతికి బాటలు పరిచే కీలక బంధం"అని ప్రకటించారు. ఉగ్రవాదం కూడా మాక్రాన్‌తో చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచి?చనట్టు ప్రధాని తెలిపారు. దాన్ని అన్ని రూపాల్లోనూ తుదముట్టించేందుకు ఇరు దేశాలూ కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు.

**సంస్కరణలతోనే సమాధానం**

ఉక్రెయిన్, పశి?చమాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు ఇతర చోట్ల యుద్ధ మేఘాలు



ఇంకా తొలగలేదని మోదీ గుర్తు చేశారు. "ఈ కల్లోల పరిస్థితుల నుంచి గట్టెక్కించగలిగేది ప్రజాస్వామిక విలువలే అన్నదే భారత్, ఫ్రాన్స్ వైఖరి. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థలను సమూలంగా సంస్కరించినప్పుడే ఈ అంతర్జాతీయ సవాళ్లకు సజావైన పరిష్కారాలు లభిస్తాయి ఆ ప్రయత్నాలకు భారత్, ఫ్రాన్స్ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తాయి. ఎందుకంటే రెండు దేశాలూ బహుళ ధ్రువ ప్రపంచాన్నే కోరుతున్నాయి"అని వివరించారు. యూరోపియన్ యూనియన్‌తో భారత్ ఇటీవలే తన చరిత్రలోనే అతి పెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని మోదీ గుర్తు చేశారు. అది భారత్, ఫ్రాన్స్ సంబంధాలకు కూడా ఎంతగానో ఊపునిచ్చే పరిణామమేనని ఆయన చెప్పారు. "ఇరు దేశాల ప్రజలు, కంపెనీలు ఇకపై రెండు పన్నులు కట్టాల్సిన దురవస్థ తప్పింది. పరస్పర వర్తకం, పెట్టుబడులు తదితరాలను నూతన శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాలకు ఈ ఒప్పందాలు సరికొత్త రోడ్‌మ్యాప్‌గా నిలిచాయి"అన్నారు.

**హెలికాప్టర్ నిర్మాణ కేంద్రం ప్రారంభం**

కర్నాటకలోని వెమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ల నిర్మాణ కేంద్రాన్ని ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇరుదేశాల మధ్య పరస్పరం నెలకొన్న లోతైన విశ్వాసానికి ఈ ప్లాంట్ ప్రారంభమే తాజా నిదర్శనమని మోదీ ఈ సందర్భంగా అన్నారు. "మౌంట్ ఎవరెస్టును మించిన ఎత్తుల్లో ఎగరగల సామర్థ్యమున్న ఏకైక హెలికాప్టర్‌ను ఇరుదేశాలూ కలిసి భారత్‌లో సంయుక్తంగా తయారు చేయనుండటం నిజంగా గర్వకారణం. వాటిని ప్రపంచమంతటికీ ఎగుమతి చేయనున్నాం"అని ప్రకటించారు. ఈ హెలికాప్టర్ల తయారీ ప్లాంటు ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ జాయింట్ వెంచర్

**భారత్ అత్యంత విశ్వసనీయ భాగస్వామి: మాక్రాన్**

ఫ్రాన్స్‌కు భారత్ అత్యంత విశ్వసనీయ భాగస్వామి అని మాక్రాన్ పేర్కొన్నారు. రఫేల్‌యుద్ధ విమానాలు మొదలుకుని జలాంతర్గాముల దాకా రక్షణ రంగంలో ఇరు దేశాల నడుమ పరస్పర సహకారం నానాటికీ పెంపొందుతోందని హర్షం వెలిబుచ్చారు. ఉగ్రవాదంపై పోరాటంలో కూడా భారత్, ఫ్రాన్స్ పరస్పరం మరింతగా సహకరించుకుంటాయని ప్రకటించారు. భారత్‌లో తనకు లభించిన అపూర్వ స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు. మాక్రాన్‌కు భారత్‌లో ఇది నాలుగో అధికారిక పర్యటన.

**ఇన్నొవేషన్ల సారథి భారత్: మాక్రాన్**

"గ్లోబల్ ఇన్నొవేషన్‌లో భారత్ కేవలం భాగస్వామి కాదు. సిలికాన్ వ్యాలీ మొదలుకుని టెక్నాలజీ, సంస్కృతి దాకా అన్ని రంగాల్లోనూ సారథి స్థానంలో రాణిస్తోంది" అంటూ మాక్రాన్ ప్రశంసించారు. ద్వైపాక్షిక చర్చల సందర్భంగా మోదీతో కలిసి 'ఇండియా--ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నొవేషన్'ను ఆయన ఆవిష్కరించారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ప్రజల భాగస్వామ్యంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యమని నేతలు వివరించారు. ఇందులో భాగంగా పరిశ్రమలు, స్టార్టప్‌లు, చిన్న--మధ్య తరహా పరిశ్రమలు, విద్యార్థులు, రక్షణ రంగంలో పరిశోధనలు, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం, నూతన టెక్నాలజీలు తదితర రంగాల్లో పరిశోధనలకు మరింత ఊపు లభిస్తుందని మోదీ అన్నారు. ఇన్నొవేషన్ ఇయర్‌లో భాగంగా ఆరోగ్యం, డిజిటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇండో--ఫ్రెంచ్ ఏఐ సెంటర్లను స్థాపించనున్నారు. ఫ్రాన్స్‌లో భారత్ త్వరలో స్వామి వివేకానంద కల్చరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.

**మెరీన్ డ్రైవ్‌లో మాక్రాన్ జాగింగ్!**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మా క్రాన్ మంగళవారం ఉదయం బాంబేలోని మెరీన్ డ్రైవ్‌లో జాగింగ్ చేశారు. నీలిరంగు టీ షర్టు, నలుపు షార్ట్స్, రన్నింగ్ షూస్ ధరించిన ఆయన జాగింగ్ చేస్తున్న వారితో కలిసి పోటాపోటీగా పరుగు తీశారు. భద్రతా సిబ్బంది మారువేషాల్లో కాస్త వెనకగా ఆయనను అనుసరించారు. ఈ సందర్భంగా ముంబై పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మాక్రాన్‌ను గుర్తు పట్టిన పలువురు ఆయన్ను తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు. అవన్నీ వైరల్‌గా మారాయి. మాక్రాన్ విదేశీ పర్యటనల్లో కూడా జాగింగ్ కొనసాగిస్తుంటారు.

**బాలీవుడ్ తారలతో మాక్రాన్ దంపతుల భేటీ**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ భారత పర్యటనలో తారల తళుకులు చోటుచేసుకున్నాయి. పలువురు బాలీవుడ్ తారలతో మాక్రాన్, బ్రిగెటీ దంపతులు మంగళవారం భేటీ అయ్యారు. సినీ పరిశ్రమపరంగా భారత్, ఫ్రాన్స్ సంబంధాల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు తదితరాలపై వారితో రెండు గంటలకు పైగా చర్చించారు. తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్లో జరిగిన ఈ సమావేశంలో జోయా అక్తర్, షబానా అజ్మీ, మనోజ్ బాజ్‌పాయ్, అనిల్ కపూర్, కబీర్ ఖాన్, రిచా ఛద్దా తదితరులు పాల్గొన్నారు. 2008లో ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్రమంటే తనకెంతో ఇష్టమని బ్రిగెటీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## ఒకే ఫైలు.. ఒకే సంతకం.. వేర్వేరు న్యాయమా?



స్వర్ణసాగరం న్యూఢిల్లీ

'ఒకే ఫైలు.. ఒకే సంతకం.. కానీ ఆ ఫైలును ఆమోదించిన నాటి గనులశాఖ మంత్రి, అంతకుముందు పనిచేసిన కార్యదర్శి ఇద్దరూ ఈ కేసు నుంచి విముక్తి పొందారు. వారెవరూ విచారణ ఎదుర్కోవడం లేదు. కానీ.. వారికింద పనిచేసిన నన్ను మాత్రమే టార్గెట్ చేసి, ఇంకా విచారణ ఎదుర్కోవాలనడం ఎక్కడి న్యాయం?' అని సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో ఆవేదన వ్యక్తం చేశారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో తనపై ఉన్న అభియోగాలను కొట్టేయాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. ఈ కేసులో శ్రీలక్ష్మిని బలిపశువును చేశారని, అసలు నిర్ణయాధికారం ఉన్నవారు బయటపడ్డారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో మొదట 9 మందిని నిందితులుగా చేర్చారని తెలిపారు. ఇందులో అప్పటి గనులశాఖ మంత్రి (సబితా ఇంద్రారెడ్డి), అప్పటి ప్రభుత్వ కార్యదర్శి (కృపానందం) తదితరులున్నారని చెప్పారు. కోర్టుల ద్వారా వారు ఈ కేసు నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. 'బాధ్యతలు స్వీకరించిన కొత్తలోనే శ్రీలక్ష్మి ఈ ఫైలును డీల్ చేశారు. నిర్ణయాధికారం ఉన్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సేఫ్‌గా బయటపడగా.. కేవలం ఒక అధికారిణిని మాత్రమే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పడం వివక్ష చూపడమే' అని పేర్కొన్నారు. ఒకే తరహా ఆరోపణలు ఎదుర్కొన్న ఇతరులకు ఊరట లభించినప్పుడు శ్రీలక్షి?మకి ఎందుకు వర్తించదని ప్రశ్నించారు.

**కేంద్రం చెప్పిందే చేశాం.. ఉల్లంఘన జరగలేదు**

ఓఎంసీకి మైనింగ్ లీజులు ఇచ్చే సమయంలో.. ప్రభుత్వ ఉత్తర్వులో క్యాప్టివ్ మైనింగ్ (సొంత పరిశ్రమల అవసరాలకు మాత్రమే ఖనిజాన్ని వాడుకునే) అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే శ్రీలక్ష్మి తొలగించి అక్రమాలకు పాల్పడ్డారన్న సీబీఐ ప్రధాన ఆరోపణపై న్యాయవాది దవే అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జాతీయ ఖనిజ విధానం ప్రకారం.. మైనింగ్ లీజుల్లో క్యాప్టివ్ వంటి షరతులు విధించకూడదని, అది నిబంధనలకు విరుద్ధమని కేంద్ర ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. కేంద్రం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించిన అధికారిణిని.. నిబంధనలు ఉల్లంఘించారని నిందించడం విడ్డూరం' అని చెప్పారు. ఐరన్ ఓర్ మేజర్ మినరల్ అయినందున, లీజుల కేటాయింపులో తుది నిర్ణయం కేంద్రానిదేనని, రాష్ట్రం కేవలం సిఫార్సు మాత్రమే చేస్తుందని తెలిపారు. అంతేగాక అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలంటే లంచం అడిగి తీసుకోవడం, తద్వారా లబ్ధి పొందినట్లు ఆధారాలుండాలని చెప్పారు. కానీ శ్రీలక్ష్మి విషయంలో ఎక్కడా డబ్బు చేతులు మారినట్లుగానీ, ఆమె ఖాతాల్లోకి నగదు వచ్చినట్లుగానీ ఆధారాలు లేవని తెలిపారు. నీరజ్ దత్తా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉటంకించారు. కేవలం ఆరోపణల ఆధారంగా అవినీతి ముద్ర వేయలేమని సిద్ధార్థ దవే చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శ్రీలక్ష్మి సోదరి భర్త (రాకేష్‌బాబు) 2005--09 మధ్య ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారని, దీనివెనుక క్విడ్ ప్రో కో ఉందన్న కోణంలో విచారణ జరిగిందని తెలిపారు. సాక్షుల జాబితాలోని ఎల్.డబ్ల్యూ--8 వాంగ్మూలం ప్రకారం డబ్బు డిమాండ్ చేసినట్లు తెలిసిందని, అధికార దుర్వినియోగం (సెక్షన్ 13(1)(డీ)) జరిగిందని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ ఎం.ఎం.సుందరేష్ ధర్మాసనం.. కేసు విచారణ దశలో ఉన్నందున తాము ఇప్పుడు మెరిట్స్‌లోకి వెళ్లలేమని, సాక్ష్యాధారాలను ఇక్కడ పరిశీలించలేమని స్పష్టం చేసింది. పిటిషనర్ లేవనెత్తిన సమాన న్యాయం, కేంద్రప్రభుత్వ ఉత్తర్వులు, ఇతర సాంకేతిక అంశాలన్నీ ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. ట్రయల్ కోర్టులో ఈ వాదనలను వినిపించుకునే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని పేర్కొంటూ విచారణను ముగించింది.

## హవాయిలో బద్దలైన అగ్నిపర్వతం

అత్యంత భారీ పరిమాణంలో నిప్పు రవ్వలు వేలాది అడుగుల ఎత్తుకు



ఎగసిపడుతుంటే ఎలా ఉంటుంది? ఇదుగో, అచ్చం ఇలాగే ఉంటుంది! హవాయి దీవుల్లో కిలవెయా అగ్నిపర్వతం బద్దలైంది. అందులోంచి లావా ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. దాని తాలూకు రెండు పాయలు సోమవారం రాత్రి ఫౌంటేన్ మాదిరిగా పైపైకి ఎగజిమ్మాయి. ఒకటి 1,300 అడుగులు, మరొకటి 1,000 అడుగుల చొప్పున పైకి ఎగశాయి. ఆకాశంలో ఎర్రని కాంతులతో చూపరులను కట్టిపడేశాయి. వాటి తాలూకు బూడిదైతే ఏకంగా 35 వేల అడుగుల ఎత్తు దాకా చేరింది! ఈ దృశ్యాలను లక్షలాది మంది ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. హవాయి నేషనల్ పార్కులోని కిలవెయా ప్రపంచంలో అత్యంత చురుగ్గా ఉన్న అగ్నిపర్వతాల్లో ఒకటి. దాని అడుగున భారీ పగుళ్లున్న కారణంగా మాగ్మా ప్రవాహాలు తరచూ తేలిగ్గా పైకి ఎగదన్నుతూ ఉంటాయి. దాంతో అది పదేపదే బద్దలవుతూ, భారీగా లావాను వెదజల్లుతూ వీక్షకులను ఆకట్టుకుంటూ ఉంటుంది. ముఖ్యంగా గత డిసెంబర్ 23 నుంచీ ఇప్పటిదాకా కిలవెయా పదేపదే బద్దవుతూ, కొన్ని గంటల వ్యవధిలోనే శాంతిస్తూ వస్తోంది. ఈసారి అది 1.5 కోట్ల క్యూబిక్ అడుగుల మేరకు లావాను వెదజల్లి ఉంటుందని అంచనా! అది ఏకంగా 11 వేల ఒలింపిక్ సైజు స్విమ్మింగ్‌పూల్స్‌ను నింపేందుకు సరిపోతుందట!! ఎప్పట్లాగే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రాణ, ఆస్తినష్టం వంటివేవీ సంభవించలేదు. మూడు వారాల తర్వాత కిలవెయా మరోసారి బద్దలవుతుందని భావిస్తున్నారు.

# సిద్ధార్థ్‌రెడ్డికి జైలు

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఏపీలో సంచలనం సృష్టించిన వర్ధమాన సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సుదీర్ఘ న్యాయ పోరాటం, దశాబ్దాల నిరీక్షణ అనంతరం సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ప్రత్యూష ప్రియుడు సిద్ధార్థ్ రెడ్డిని దోషిగా తేలుస్తూ, అతనికి విధించిన శిక్షను అనుభవించేందుకు నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు విధించిన శిక్షను సవాల్ చేస్తూ గుడిపల్లి సిద్ధార్థ్ రెడ్డి, శిక్షను పెంచాలని కోరుతూ ప్రత్యూష తల్లి సరోజినీ దేవి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. తుది తీర్పును వెల్లడించింది. మెరిట్స్ లేవంటూ సిద్ధార్థ్ రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది. గత నవంబర్‌లో వాదనలు విన్న సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

**సుప్రీంకోర్టు తీర్పు--12 కీలక పాయింట్లు**

జస్టిస్ మనోజ్ మిశ్రా తీర్పును చదువుతూ 12 అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నట్లు వెల్లడించారు.

హత్య అనే వాదన చెల్లదు: ప్రత్యూషను గొంతు నులిమి చంపారన్న ఆరోపణలకు సరైన ఆధారాలు లేవు. హత్య కోణాన్ని కోర్టు తోసిపుచ్చింది.

విషమే ప్రాణం తీసింది: అందుబాటులో ఉన్న మెడికల్ రిపోర్టులు, ప్రత్యక్ష సాక్ష్యాల ప్రకారం.. ఆమె మరణం కచ్చితంగా విషం తీసుకోవడం వల్లనే సంభవించినట్లు రూఢీ అయ్యింది.

అత్యాచారం జరగలేదు: సిద్ధార్థ్ రెడ్డి ప్రత్యూ షపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలు రుజువు కాలేదు.

ఆలస్యపు ఆరోపణలు: కేసు విచారణ చాలా కాలం జరిగా క, ఆలస్యంగా అత్యాచారం, హత్య జరిగిందంటూ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవడం కష్టసాధ్యం.

డాక్టర్ మునిస్వామిపై ఆగ్రహం: ఈ కేసులో అత్యంత కీలకమైన పోస్టుమార్టం నివేదికను అందించిన డాక్టర్ బి.మునిస్వామి తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది.



ఆయన సమర్పించిన నివేదిక 'అన్‌ప్రొఫెషనల్'గా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

ముందస్తు లీకులు: నివేదికను అధికారికంగా సమర్పించకముందే, అసంపూర్తి సమాచారాన్ని బయటపెట్టడం వల్ల కేసు దారి మళ్లిందని, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది.

సాక్షి నం. 34 కీలకం: సాక్షి నంబర్ 34 వాంగ్మూలం విశ్వసనీయంగా ఉందని, అది తీర్పులో కీలకపాత్ర పోషించిందని ధర్మాసనం తెలిపింది.

నిందితుడికి వ్యతిరేకంగా: పరిస్థితుల ప్రభావం, సాక్ష్యాలు స్పష్టంగా నిందితుడికి వ్యతిరేకంగా ఉన్నాయి.

ప్రమాదవశాత్తు కాదు: కూల్‌డ్రింక్‌లో ఏదో కలిపామని, అది ప్రమాదవశాత్తు జరిగిందన్న డిఫెన్స్ వాదనను కోర్టు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

విషం కొన్నది అతడే: ఆత్మహత్య చేసుకోవడానికి ఉపయోగించిన 'నొవాక్రాన్'అనే పురుగుల మందును సిద్ధార్థ్ రెడ్డే కొనుగోలు చేశాడన్న విషయం రుజువైంది. ఇది ఆత్మహత్యకు ప్రేరేపించడమే.

ఆ తీర్పు వర్తించదు: వెల్లూరు కేసులో ఇచ్చిన తీర్పును ఈ కేసులో అన్వయించుకోలేమని కోర్టు స్పష్టం చేసింది.

సర్వైవింగ్ పార్ట్‌నర్‌దే బాధ్యత: ఇది అత్యంత కీలకమైన అంశం. ఇద్దరు వ్యక్తులు పరస్పర అంగీకారంతో ఆత్మ హత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు.. అందులో ఒకరు చనిపోయి, మరొకరు బతికితే.. చట్టప్రకారం బతికున్న వ్యక్తి ఆ మరణానికి బాధ్యుడవుతాడు. ఈ చట్టపరమైన అంశం ఆధారంగానే సిద్ధార్థ్‌రెడ్డిని దోషిగా కోర్టు నిర్ధారించింది.

**ఆ రోజు ఏం జరిగింది?**

2002 ఫిబ్రవరి 23 సాయంత్రం.. సినీ పరిశ్రమ ఉలిక్కిపడింది. అప్పుడప్పుడే వెండితెరపై తళుక్కుమంటున్న యువనటి ప్రత్యూష, ఆమె ప్రియుడు సిద్ధార్థ్ రెడ్డిలు పెద్దలు పెళ్లికి అంగీకరించలేదన్న కారణంతో ఆత్మహత్యకు యత్నించారు. కూల్‌డ్రింక్‌లో విషం (పురుగుల మందు) కలుపుకొని తాగారు. వెంటనే ఇద్దరినీ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఫిబ్రవరి 24న ప్రత్యూష కన్నుమూసింది. సిద్ధార్థ్ రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు.

ప్రత్యూష మరణం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇది ఆత్మహత్య కాదని, సిద్ధార్థ్ రెడ్డే ఆమెను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఆరోపించారు. సిద్ధార్థ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉండటంతో కేసును నీరుగారుస్తున్నారని అప్పట్లో ఆందోళనలు జరిగాయి. తొలుత ఈ కేసును విచారించిన నాంపల్లి కోర్టు.. సిద్ధార్థ్ రెడ్డిని ఆత్మహత్యకు ప్రేరేపించిన దోషిగా తేల్చుతూ ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించింది. దీనిపై సిద్ధార్థ్ రెడ్డి హైకోర్టుకు వెళ్లగా, శిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ తీర్పునిచ్చింది.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక
RNI No : APTEL/2020/13906



# చెరువు కట్టపై వెంచర్ రహదారి!

- చెరువు కట్టపై వెంచర్ రహదారి!
- రాత్రికి రాత్రే ఎర్రమట్టి పోసి భారీ మార్గం,
- కోట్ల ప్లాట్ల వ్యాపారం వెనుక కబ్జాల ఆరోపణలు,
- రెవెన్యూ, విద్యుత్ శాఖల మౌనం అనుమానాస్పదం,



స్వర్ణసాగరం- తొట్టంబేడు

తొట్టంబేడు మండలంలో రియల్ ఎస్టేట్ అక్రమాలు రోజు రోజుకూ విస్తరిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తొట్టంబేడు పంచాయతీ పరిధిలో తంగేళ్ల పాలెం సింగిల్ విండో సహకార బ్యాంక్ సమీపంలో ఉన్న రామచంద్రాపురం చెరువు కట్టను తొలచి వెంచర్‌కు రహదారిగా మార్చిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

స్థానికుల కథనం ప్రకారం, గతంలో ఏర్పాటు చేసిన వెంచర్ దారిని మారుస్తూ చెరువు కట్టపైకి మళ్లించారు. అనంతరం రాత్రికి రాత్రే భారీగా ఎర్రమట్టి, గ్రావెల్ తరలించి విశాల రహదారిని నిర్మించినట్లు తెలుస్తోంది. చెరువు కట్టపై నిర్మించిన ఈ మార్గం ద్వారా వెంచర్ ప్లాట్లకు సౌకర్యం కల్పిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**విద్యుత్ లైన్ల తొలగింపుపై అనుమానాలు :**

చెరువు కట్టకు ఆనుకొని ఉన్న విద్యుత్ లైన్లను తొలగించే యత్నాలు జరిగినట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారులు విద్యుత్ అధికారులకు ప్రభావం చూపించి, ఆక్రమిత స్థలంలోని లైన్లను మార్చించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**రెవెన్యూ శాఖ స్పందన ఎక్కడ?**

ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, చెరువు కట్ట వంటి ప్రజా వనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే అయినా, ఇప్పటివరకు ఎటువంటి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**బ్యాంకు స్థలం కూడా కబ్జా?**

ఇదే ప్రాంతంలో పిఎసిఎస్ తంగేళ్లపాలెం సహకార బ్యాంకుకు కేటాయించిన స్థలం కూడా కబ్జాకు గురవుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త సింగిల్ విండో బ్యాంక్ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజాఆస్తుల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన సంబంధిత శాఖలు తక్షణం స్పందించి అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ వ్యవహారంపై సింగిల్ విండో సహకార బ్యాంక్ అధికారులు, చైర్మన్, రెవెన్యూ మరియు విద్యుత్ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితి తొట్టంబేడు మండలంలో నెలకొంది.

## ఘనంగా బాదేషా పాశ్చాహుస్సేనీ గంధ మహోత్సవం

**ప్రత్యేక ప్రార్ధనలు చేసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ దంపతులు**

కనిగిరి స్వర్ణసాగరం ఫిబ్రవరి 17

చరిత్రకు సాక్షిగా కల్గిన హాజరత్ శ్రీశ్రీ సయ్యద్ బాదేషా పాశ్చా హుస్సేని చిష్టవుల్ ఖాదరీ 128వ గంధమహోత్సవ వేడుకలు మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. హజరత్ బాదేషా పాశ్చాహుస్సేని దర్గాలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ దంపతులు విశిష్ట పూజలు చేశారు. స్వామి వారి దర్గా పై పూల్ చాదర్( పూజా వస్త్రం) ఉంచి, ఎంతో భక్తి శ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అల్లాహ్ కృపతో సర్వమానావళి సుఖ సంతోషాలతో విరజిల్లాలని ఆకాంక్షిం చారు. అనంతరం దర్గా కమిటీ నాయకులు చైర్మన్ గఫార్ దంప తులను ఘనంగా సన్మానించారు. అలాగే పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, న్యాయవాది సుమైర్, హన్ను, బన్ను, మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు పీర్ హుస్సేన్, ఎస్కే ఖాదర్ జీలాని, మున్నా, సమద్, మదర్ థెరిస్సా సేవాసమితి నాయకులు ద్రోణా దుల చెంచులు, ఎల్ఐసీ నారాయణ, దర్గా కమిటీ నాయకులు పాల్గొన్నారు.





## తీరంలో యుద్ధ నౌకల జాతర



-మొదటిపేజీ తరువాయి

దినేష్ కె.త్రిపాఠి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విక్రాంత్‌పైకి మిగ్–29 జెట్ విమానాలు చేసిన ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలు సందర్శకులను మైమరిపించాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొననున్నాయి.

**విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

బుధవారం జరిగే ఫ్లీట్ రివ్యూలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఎంపీ శ్రీభరత్, జిల్లా ఉన్నతాధికారులు, నేవీ అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం నేరుగా పోర్టు గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

## శ్రీవారి సొమ్ము దోపిడీకి ఇందాపూర్ ముసుగు

-మొదటిపేజీ తరువాయి

ముసుగులో భారీ ఎత్తున శ్రీవేంకటేశ్వరస్వామి సంపదను తన కుటుంబ సంస్థ హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు చంద్రబాబు పూనుకున్నాడు. ఆ దుర్బుద్ధితోనే కల్తీ నెయ్యి పేరుతో శ్రీవారి ప్రసాదంపై నిందలు మోపాడు. ఇప్పుడు చంద్రబాబు చేసిన కుట్రలు బట్టబయలయ్యాయి. అందుకే ఇందాపూర్––హెరిటేజ్ అనుబంధం గురించి మండలిలో చర్చకు పట్టుబడితే ప్రభుత్వం భయపడుపోతోంది' అన్నారు. బొత్స ఇంకా ఏమన్నారంటే..

**అందుకే లడ్డూపై దుష్ప్రచారం**

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఎంతో భక్తితో పూజించే కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదం గురించి సీఎం చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశాడు. లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు, గొడ్డు మాంసం, చేపల నూనె కలిసిందని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సహా కూటమి నాయకులు దుష్ప్రచారం చేశారు. జంతువుల కొవ్వు కలిసిందంటూ వారు చేసిన ప్రచారమంతా పచ్చి అబద్ధమని సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ఏర్పాటు చేసిన సిట్ చార్జిషీట్‌తో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలోనే లడ్డూపై దుష్ప్రచారం చేయడం వెనుక ఉన్న దుర్బుద్ధి బయట పడింది. తన కుటుంబ సంస్థ హెరిటేజ్ డెయిరీకి లాభం చేకూర్చడానికి దేవుడి లడ్డూను వాడుకున్నాడు. పనిలో పనిగా వైఎస్ జగన్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించడానికి భారీ కుట్ర చేశాడు.

**నాడు నెయ్యి కాంట్రాక్టులు ఇందాపూర్ డెయిరీకే**

2014––19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులను ఇందాపూర్ డెయిరీ అనే సంస్థ ముసుగులో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు చంద్రబాబు కట్టబెట్టారు. ఈ ఇందాపూర్ డెయిరీ అనేది హెరిటేజ్ ఫుడ్స్ అనుబంధ సంస్థే. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చైర్‌పర్సన్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు దేశంలో పాలు, పాల ఉత్పత్తులు (డెయిరీ ప్రొడక్ట్స్) తయారు చేసే 22 సంస్థలు ఉన్నాయి. మహారాష్ట్రలోని 'ఇందాపూర్ డెయిరీ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ లిమిటెడ్' కూడా వాటిలో ఒకటి. ఆ ఇందాపూర్ డెయిరీకే 2014––19లో నాటి సీఎం చంద్రబాబు ఏకపక్షంగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఇందాపూర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యి శాంపిల్స్ 2016లో ల్యాబ్ పరీక్షల్లో విఫలమయ్యాయి. ఆ డెయిరీపై అనర్హత వేటు వేశారు. కానీ కేవలం ఆరు నెలల్లోనే ఆ అనర్హతను తొలగించారు. ఆ తర్వాత 2019లో అధికారం నుంచి దిగిపోయే వరకు ఇందాపూర్ డెయిరీకి రూ.వందల కోట్ల విలువైన నెయ్యి కాంట్రాక్టులు అప్పగించారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోగానే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన ఇందాపూర్ డెయిరీ టీటీడీ టెండర్ల ప్రక్రియ నుంచి తప్పుకుంది. అయిదేళ్ల పాటు కనీసం బిడ్లు కూడా దాఖలు చేయలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మళ్లీ తెరపైకి వచ్చింది. 2025 డిసెంబరులో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొంది.

**హెరిటేజ్ డెయిరీకి ఇందాపూర్ ముసుగు**

ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ డెయిరీతో ఉన్న అనుబంధం గురించి హెరిటేజ్ వెబ్‌సైట్‌లోనే రాసి ఉంది. ఇందాపూర్ డెయిరీని మాన్యుఫ్యాక్చురింగ్ యూనిట్స్, ఫ్యాక్టరీల అడ్రుస్‌ల పేరుతో స్పష్టంగా రాసుకుంది. ఇండోర్ అడ్రుస్‌తో 17వ యూనిట్‌గా ఇందాపూర్ డెయిరీ గురించి రాశారు. ఈ ఇందాపూర్ డెయిరీ ద్వారానే హెరిటేజ్ ఫుడ్స్ తిరుమలకు నెయ్యి తయారు చేసినట్టు మీడియా ద్వారా ప్రపంచానికి తెలియగానే హెరిటేజ్ వెబ్‌సైట్ నుంచి ఇందాపూర్ ప్లాంట్‌ను అనుబంధ సంస్థగా మార్చేసి మసిపూసి మారేడుకాయ చేయాలని చూశారు. వెబ్‌సైట్‌లో అప్పటి వరకు ఇందాపూర్ డెయిరీని మాన్యుఫ్యాక్చురింగ్ యూనిట్ల జాబితాలో చూపిన హెరిటేజ్ డెయిరీ, తమ వ్యవహారం బయటుపడుటంతో ఇందాపూర్ డెయిరీని మ్యానుఫ్యాక్చురింగ్ యూనిట్ల జాబితా నుంచి తొలుగించి, కో మాన్యుఫ్యాక్చురింగ్ యూనిట్లలో చేర్చారు.

**చర్చకు ప్రభుత్వం భయపడింది**

హెరిటేజ్ డెయిరీతో ఇందాపూర్ డెయిరీకి ఉన్న అనుబంధం గురించి చర్చించాలని మండలిలో వైఎస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం భయపడి పారిపోయింది. రూ.300కు స్వచ్ఛమైన కేజీ నెయ్యి వస్తుందా.. అని మాట్లాడిన చంద్రబాబు మాటల వెనుక మర్మం ఇందాపూర్ డెయిరీకి డబుల్ రేటుకు నెయ్యి కాంట్రాక్టు కట్టబెట్టడుమేనని తేలిపోయింది. 2025 డిసెంబర్‌లో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్న ఇందాపూర్ డెయిరీ.. రూ.658కి కేజీ నెయ్యి సరఫరా చేస్తామని కోట్ చేసింది. దీంతో అదే ధరకు నెయ్యి సరఫరా చేసేలా, గత ఏడాది డిసెంబర్‌లో టీటీడీ ఇందాపూర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఖరారు చేసింది. అధిక ధరలకు హెరిటేజ్‌కి నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టడానికి తిరుమల లడ్డూ గురించి చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. దోచుకోవడం కోసం దేవుడిని రాజకీయాల్లోకి లాగడం కన్నా దుర్మార్గం ఇంకోటి ఉంటుందా? హిందూ ధర్మ పరిరక్షణ పేరుతో రాజకీయాలు చేస్తూ భక్తుల విశ్వాసాలతో ఆడుకోవడం సిగ్గుచేటు.

## జన విజ్ఞాన వేదిక అవగాహన కార్యక్రమం

రేణిగుంట స్వర్ణసాగరం ఫిబ్రవరి 17

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఖగోళ శాస్త్రవేత్త, గణిత శాస్త్రవేత్త వేత్త బ్రూనో బలిదానం సందర్భంగా సత్యాన్వేషణ రోజున రేణిగుంట మూడు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 12 న జన్మించిన శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జీవి పుట్టుక పరిణామం, కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతం గెలీలియో గమన సూత్రాలు, బ్రూనో



త్యాగం అంశాలను రేణిగుంట జిల్లా బాలికల, బాలల, ఆర్సీయం పాఠశాల విద్యార్థులకు పరిచయం చేయడం జరిగింది. అదే విధంగా రామన్ ఎఫెక్ట్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా భావి భారత శాస్త్రవేత్తల తయారు కావాలని, అందుకు గాను శాస్త్రీయదృక్పథం, సత్యా న్వేషణ, ప్రయోగాల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఓ వెంకట రమణ తెలిపారు. హెచ్ ఎం శ్యామల, టీచర్లు శిరీష, లక్ష్మి, శ్రీరాములు, జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పలు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ ప్రసాదరావుకు జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి

స్వర్ణసాగరం చల్లపల్లి

గ్రేడ్ –1 సబ్ రిజిస్ట్రార్ కె.ప్రసాదరావుకు జిల్లా రిజిస్ట్రార్ గా పదోన్నతి లభించింది. జిల్లా నుంచి ముగ్గురు గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించగా, వారిలో ప్రసాదరావు ఒకరు. పదోన్నతి పొందిన ఆయన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ప్రసాదరావును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో



లయన్స్ క్లబ్ పెద్దలు మోపిదేవి వెంకటేశ్వరరావు, ఏఎల్.ఆర్కే.ప్రసాద్, కస్తూరి వరప్రసాద్, ఉప్పల సాంబశివరావు, పరిశె జలంధర్, బుల్లా కిషోర్, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, హెచ్‌ఎం కైతేపల్లి దాస్, ఘంటసాల మండల బీజేపీ అధ్యక్షుడు తాళ్లూరి ఫణి హరి ప్రసాద్, టీడీపీ నేతలు వేముల హరికృష్ణ, అమీర్ జానీ, కార్యాలయ సూపర్నెంట్ తాడేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మండలిలో వైసీపీ రచ్చ!

-మొదటిపేజీ తరువాయి

హెరిటేజ్ నెయ్యి సరఫరా చేసిందన్న ఆరోపణలపై చర్చించాలని వైసీపీ సభ్యులు కేఆర్‌జే భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించి, వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పేదలకు ఇళ్ల స్థలాలపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పీహెచ్‌సీ భవనాల పునరుద్ధరణపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇస్తుండగా, వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. కొందరు పోడియం పైకి ఎక్కి, హెరిటేజ్‌పై చర్చకు అనుమతించాలని పట్టుబట్టారు. 'హెరిటేజ్ పాలు, పెరుగు, నెయ్యి, కూటమి పాలన, సీఎం చంద్రబాబు విధానాలు కల్తీ.. గోవిందా.. గోవిందా' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పశువైద్యశాలల్లో పరికరాల కొరతపై మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా వైసీపీ సభ్యులు పెద్దగా నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ఆందోళన చేశారు. మంత్రి పార్థసారథి జోక్యం చేసుకుని, శ్రీవారి లడ్డూ విషయంలో వైసీపీ నేతలు చేసిన పాపం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హెరిటేజ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హెరిటేజ్ వల్ల ప్రభుత్వానికి, టీటీడీకి ఏ నష్టం జరిగిందో చెప్పాలన్నారు. వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, ఆ పార్టీ సభ్యులు నినాదాలు కొనసాగించారు. 'మంత్రులు మాట్లాడేటప్పుడు నినాదాలు చేస్తున్నారు. సభను గౌరవించి, పోడియం దిగండి. మీ పార్టీ నేత మాట్లాడతారు' అని చైర్మన్ కోరారు. అయినా వైసీపీ సభ్యులు చర్చకు పట్టుబట్టడంతో సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే సభ్యుల విజ్ఞప్తి మేరకు మిగిలిన ప్రశ్నలను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో హెరిటేజ్‌పై చర్చకు అనుమతించాలని వైసీపీ సభ్యులు మరోసారి డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ప్రత్యేక అంశాల ప్రస్తావనకు చైర్మన్ అనుమతించడంతో బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు, జనసేన సభ్యుడు నాగేంద్రబాబు, టీడీపీ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి తదితరులు వివిధ అంశాలపై మాట్లాడుతుండగా, వైసీపీ సభ్యులు పెద్దగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. ఆందోళన విరమిస్తే బడ్జెట్‌పై చర్చ చేపడతామని చైర్మన్ చెప్పినా వారు నినాదాలు చేస్తుండటంతో సభను మరో 15 నిమిషాలు వాయిదా వేశారు. గంట తర్వాత సభ ప్రారంభం కాగానే మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడబోతుండగా, వాయిదా తీర్మానంపై చర్చ కోరుతూ వైసీపీ సభ్యులు మరోసారి తమ స్థానాల నుంచి లేచి, పోడియం వద్దకు వచ్చారు. దీంతో అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. దేవుడిపైన, హిందూ భక్తులపైనా జగన్ పగబట్టారని, లడ్డూల కల్తీని పక్కదారి పట్టించడానికి హెరిటేజ్ అంశాన్ని తెచ్చారని అచ్చెన్న మండిపడ్డారు. సభా మర్యాదను, గౌరవాన్ని కాపాడాలని కూటమి ఎమ్మెల్సీలు చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. 'అన్నీ కల్తీ కల్తీ' అంటూ నినాదాలు చేస్తున్న వైసీపీ సభ్యుడు రుహుల్లాపై చైర్మన్ మండిపడ్డారు. 'దేవుడి పేరు చెప్పి.. లడ్డూల కల్తీ అంటూ కూటమి ప్రభుత్వమే అవినీతికి పాల్పడుతోంది' అని బొత్స ఆరోపించారు. వాయిదా తీర్మానంపై చర్చ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో మండలి దద్దరిల్లడంతో చైర్మన్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

ఇ'మండలిలో పెద్ద డ్రామా జరుగుతోంది. సభకు ఏమాత్రం సంబంధం లేని విషయాన్ని వైసీపీ సభ్యులు ప్రస్తావించి, డ్రామా ఆడుతున్నారు. దేవుళ్ల, హిందువులపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారు' అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'హెరిటేజ్‌కు తిరుపతి లడ్డూకి సంబంధం ఏమిటి? కల్తీ జరిగిందని అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డే అంగీకరించారు. హెరిటేజ్‌పై ఆరోపణలకు ఆధారాలేవీ? ప్రజల దృష్టి మళ్లించాలని చూస్తున్న వైసీపీకి దమ్ముంటే లడ్డూ కల్తీపై చర్చకు రావాలి. ఏడుకొండల వాడికి జగన్ తండ్రి రెండు కొండలు చాలన్నారు. చేసిన తప్పిదానికి లెంపలేసుకోవాల్సింది పోయి, వెనకేసుకొచ్చి మాట్లాడుతున్నారు. తప్పుచేసి, ఇరుక్కుపోయిన వైసీపీని యావత్ హిందూ సమాజం ఛీ కొడుతోంది. సిగ్గు పడాల్సింది పోయి, ఎదురు దాడిచేసి, సభను పక్కదారి పట్టించాలనే ఆందోళన చేస్తున్నారు. కుట్ర రాజకీయాలు సాగవు. మండలి స్తంభించిపోయినట్లు మీ పత్రికలో రాసుకోవాలనా? హిందూ దేవుళ్ల, హిందూ భక్తులపై జగన్‌తో సహా వైసీపీ వారు పగబట్టారు. హిందూ సంప్రదాయాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. నిజం దాగదు. బాధ్యులపై చర్యలు తప్పవు' అని అచ్చెన్న హెచ్చరించారు. హెరిటేజ్ విషయంలో ఆధారాలుంటే చూపించాలని వైసీపీ సభ్యులను మండలి చైర్మన్ కోరాలని, లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు.

బుధవారం 18 ఫిబ్రవరి 2026

స్వర్ణసాగరం



తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# “కసుమూరు నందీశ్వర విగ్రహ దారికి “బాటపర్పాటు”





## శివాలయ నిర్మాణ ఏర్పాటుకు కృషి జనసేన నేత బొబ్బేపల్లి

వెంకటాచలం స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడుమంగళవారంమండలంలోని కసుమూరులో పర్యటించారు.దర్గాకు వెనుక వైపున చెరువు కట్ట అంచున పురాతన కాలం నుంచి ఉన్న లింగస్వరూపుడు పరమశివునరూపంతో ఉన్న నందీశ్వరవిగ్రహం గతంలో అపహరణకు గురైందన్నారు ఆనాటి నుంచి విగ్రహానికి నీడ లేకపోవడం తోదర్గాకు వచ్చేవారుశివుని విగ్రహం వద్ద ధూపం దీపం వెలిగించు కుంటారని తెలిపారు.ఈ ప్రాంతానికి సరైన దారి లేదన్న విషయం తెలుసుకొని జెసిబి సహాయంతో చెరువు కట్ట అంచున బాట ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో చెరువులను కోనేరులను దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారుఇక్కడ శివాలయం ఏర్పాటుపై సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టి కూడా తెస్తామన్నారు.నిర్మాణానికి తమ వంతు సహాయం చేస్తామని సురేష్ నాయుడు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి చందూరి శ్రీహరి పొట్లూరు సుబ్రహ్మణ్యం శివరాత్రి సందీప్ బొర్రా శీను దేవుళ్ళ పెంచలయ్య నక్క శివ తాటి బోయిన మధు దాసేపల్లి సుబ్బయ్య గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం





## 500 మంది భక్తులకు అన్నదానం

### ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున నాయుడు

స్వర్ణ సాగరం ఓజిలి ఫిబ్రవరి 17:

మండల పరిధిలోని సగుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బాలా మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలలో భాగంగా మూడవరోజు మంగళవారం శివపార్వతులకు ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున నాయుడు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ముందుగా గణపతి పూజ, కలిసి స్థాపన, పునః పూజ చేశారు. ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకొని వచ్చారు. ఆలయ పండితులు శివపార్వతుల కళ్యాణమును కన్నుల పండుగ నిర్వహించారు. గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. హైదరాబాద్ పట్టణానికి చెందిన చెరుకూరు రాధాకృష్ణ, మేడిశెట్టి సుదీప్ చంద్ర, నాదెండ్ల వెంకటేశ్వర్లు కళ్యాణం ఉభయ కర్తలగా వ్యవహరించారు. అనంతరం స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. మధ్యాహ్నం ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున నాయుడు ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకలలో భాగంగా మూడురోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శివపార్వతుల దర్శనం కల్పించామని ఆలయ చైర్మన్ తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని ఆయన కోరారు. మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేసినందుకు గ్రామస్తులు, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం ఎదగాలి

## విద్యను సార్ధకం చేసుకోవాలి

### జి వి ఆర్ ఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సభలో ఎంఈఓ మురళీధర్





నెల్లూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరేందుకు ఎదగాలని ఇందుకోసంతాము చదివిన విద్యను స్వార్ధకం చేసుకోవాలని నెల్లూరు గ్రామీణ మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ పేర్కొన్నారు జి.వి.అర్.ఆర్. జూనియర్ కళాశాలలో 44వ వార్షికోత్సవం మరియు సరస్వతి పూజా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు . ప్రారంభంలో చదువుల తల్లి శ్రీ సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల ఆవిష్కరించి పూజ ప్రారంభించడం జరిగింది. తదుపరి విద్యార్థులు అందరి చేత స్వామి వారు పుష్ప మాటలతో సరస్వతి దేవికి పూజ చేయించడం, శ్లోకాలు పలికించడం, విద్యార్థులను దీవించడం జరిగింది. పూజ అనంతరం విద్యార్థులను ఉద్దేశించి స్థానిక నెల్లూరు గ్రామీణ మండల విద్యాధికారి =.మురళీధర్ పాల్గొని పరీక్షలలో ఎలా చదవాలి, ఎలా జ్ఞాపకం ఉంచుకోవాలి,ఎలా ఉండాలో ఇప్పటినుండే కష్టపడి చదివి తల్లిదండ్రుల కోరికలు తీర్చాలని, ఒక ఉన్నత లక్ష్యం కోసం పనిచేయాలని తెలియజే యడం జరిగింది. అనంతరం కళాశాల కరస్పాండెంట్ పల్నాటి రామదండు విద్యార్థులను ఉద్దేశించి ఆ చదువుల తల్లి సరస్వతి దేవి కరుణాకటాక్షాలు ఉండాలని బాగా చదువుకొని చక్కగా పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని, దేశం కోసం, ధర్మం కోసం పనిచేయాలని ఇప్ప టినుండి భవిష్యత్తులో ఏం కావాలో నిర్ణయించుకొని ఆ విధముగా ముందుకు వెళ్లాలని తెలి యజేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీ సాంబశివరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈరోజు భారతదేశం ప్రపంచంలో విశ్వ గురువుగా ఉందని, ప్రపంచానికి దిశ, దశ చూపించే విధంగా రోజు భార తదేశం తయారైందని, అనేక రంగాలలో ఈరోజు భారతదేశం ముందుకు వెళుతుందని కాబట్టి విద్యార్థులు అందరూ కూడా చక్కగా చదువుకొని ఉత్తీర్ణులై ఏదో ఒక రంగాన్ని ఎంచుకునే భవి ష్యత్తులో ఉన్నతమైన స్థానానికి వెళ్లి ఈ దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని ఇప్పటినుండి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని తెలియజేయడం జరిగింది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ బి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు ఎలా రాయాలో, ఎలా చదవాలో ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తూ పరీక్ష సెంటర్ కి ముందుగా వెళ్లాలని మరియు పరీక్షా సమయాల్లో తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. కార్యక్రమం అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఎంతో చక్కగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. చివరలో విద్యార్థిని విద్యార్థులు అందరికీ ప్రసాదం అందించడం జరిగింది.

# పొలం పిలుస్తుంది లో వ్యవసాయ అధికారులు





తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 16

మండలంలో లోని పాపిరెడ్డి పాలెం మరియు చిన్న చెరుకూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు . జిల్లా వనరుల కేంద్రం నుండి సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీ దేవి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం గురించి వివరించారు అధిక నత్రజని వాడకం వలన కలిగే నష్టాలను రైతులకు వివరించారు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు పచ్చిరొట్ట ఎరువులు వాడకం ద్వారా నేలను సారవంతం చేసుకోవచ్చని తెలిపారు అధిక నత్రజని వాడకం వలన పంటలకు చీడపీడలు ఎక్కువ అవుతాయని తెలిపారు నత్రజనితోపాటు ఆఖరి దుక్కిలో 20 కేజీల పొటాష్ మరియు

అంకు రం ఏర్పడే దశలో 20 కేజీల పొటాష్ వేయడం వలన గింజ నాణ్యత పెరిగి అధిక దిగుబడి పొందవచ్చునని రైతులకు వివరించారు వ్యవసాయాధికారి శిరీష రాణి మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ లబ్ధి పొందాలంటే ఈ రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని తెలిపారు గ్రామములోని రైతులకు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయడం జరిగినది ఈ పంట నమోదు పూర్తి కావస్తున్నందున రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకులు పార్వతి మరియు నిరీష పాల్గొన్నారు

# నులిపురుగులతో అనారోగ్య సమస్యలు

## డాక్టర్ ఖాదర్ వల్లి



తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 17

నులి పురుగులు కారణంగా అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని డాక్టర్ ఖాద ర్ వలీ పేర్కొన్నారు మంగళవారంమండలంలోనికోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ (ఎయిడ్స్ లెప్రసీ అండ్ టీబి) ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్ వలీ మాట్లాడుతూ నులిపురుగులు వలన కలుగు రక్తహీనత,చదువు పట్ల ఏకాగ్రత లేకపోవడం మరియు తదితర నష్టాల పట్ల అవగాహన కల్పించడం జరిగింది. చేతుల పరిశుభ్రత వలన కలుగు ఉపయోగాలు గురించి వివరించడం జరిగింది మరియు ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ ,కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ హేన , ఉప ఆరోగ్య విద్యాధికారి ఉమర్, పర్యవేక్షకులు సతీష్,ఆరోగ్య కార్యకర్తలు మస్తానమ్మ, బెంజిమన్ మరియు ఆశా కార్యకర్త కామాక్షమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది మరియు కోడూరు వన్ సచివాలయము పరిధిలోనీ వీ. +.కాల నీలోని అంగన్వాడి సెంటర్ నందు పిల్లలకు కూడా ఆల్బెండజోల్ మాత్రలను డా క్టర్ ఖాదర్ వలీ మింగించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ హేనా, సిహెచ్ఓ రమే ష్, ఉప ఆరోగ్య విద్యాధికారి ఉమర్, అంగన్వాడి సూపర్వైజర్. రంగమ్మ ఆరోగ్య కార్యక ర్తలు సుజాత రాజు మరియు అంగన్వాడీ కార్యకర్త చెంచమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది

# త్రాగునీటి కొళాయి ల ద్వారా కలుషిత నీరు

## పంచాయితీఅధికారులు పట్టించుకోవడం లేదన్న గ్రామస్తులు



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

తోటపల్లి గూడూరు బిట్ వన్ పరిధిలోని డైరెక్ట్ పంప్ సిస్టం ద్వారా ప్రజలకుసరఫరా అవుతున్న తాగునీటి కుళాయిల ద్వారా వచ్చే నీళ్లు కలుషితంగా వస్తున్నాయని దీనివల్ల త్రాగునీటికి ఇబ్బందిగా మారి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు పైపుల్లో లీకేజీ కారణంగా కలుషిత నీరు రావడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ అధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు పంచాయతీ ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు స్పందించి పైపుల లీకేజ్ నివారించి కలుషిత నీరు అరికట్టాలని కోరుతున్నారు

# దువ్వూరు సరోజనమ్మ మృతదేహానికి మాజీ మంత్రి కాకాణినివాళి

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17



మండలంలోని వరిగొండ గ్రామానికి చెందినవైకాపా నేత చింతం రెడ్డి దశరథ రామిరెడ్డి అత్తదువ్వూరు సరోజనమ్మ మంగళవారం మృతిచెం దారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాకాణిగోవర్ధన రెడ్డివిచ్చేసి మృతదేహానికి నివాళులు అర్పించారు కుటుంబానికి సానుభూతి తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను తన దృష్టికి తెచ్చారని తెలిపారు.రాష్ట్ర బడ్జెట్లో రూ 500 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించడం ద్వారా రైతుల్లో నిరాశ ఎదురైందన్నారు .పంటల ద్వారా ధాన్యం రావడంతో తగిన గిట్టుబాటు ధరతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ప్రయోజనం కలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరించే క్రమంలోతమ పార్టీ నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారుఈ పరామర్శలోవైకాపా రాష్ట్ర సీనియర్ నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్ చిల్లకూరు ప్రవీణ్ రెడ్డినెల్లిపూడి సునీల్ రెడ్డి శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు చింతం రెడ్డి దశరథ రామిరెడ్డి సత్యదీపక్ రెడ్డి ఉన్నారు

# దేవిరెడ్డి సుబ్బారెడ్డి భౌతిక కాయానికి దద్దాల నివాళి



కనిగిరి స్వర్ణ సాగరం ఫిబ్రవరి, 17

కనిగిరి పట్టణంలోని కొత్తూరులో వైసీపీ నాయకుడు దేవిరెడ్డి నారాయణరెడ్డి తండ్రి దేవిరెడ్డి సుబ్బారెడ్డి అనారోగ్యం కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ఉదయం వారి నివాసానికి వెళ్లి సుబ్బారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.దేవిరెడ్డి సుబ్బారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గపూర్,మడతల కస్తూరి రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, శ్రీరామ సతీష్,సైకం ఏడుకొండలు రెడ్డి,భూమిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 2/17/2026 11:14 PM Page 2



# అసైన్డ్ భూములు కొనుగోలు విక్రయాలు నేరం రిజిస్ట్రేషన్లు రద్దు క్రిమినల్ కేసులు తప్పవు

## తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు

స్వర్ణ సాగరం ప్రతినిధి డక్కిలి (ఫిబ్రవరి 18)



తిరుపతి జిల్లా డక్కిలి మండలం,రైతుల సాగు కోసం ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను కొనుగోలు చేసినా, విక్రయించినా అది చట్టరీత్యా నేరమేనని డక్కిలి తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు స్పష్టం చేశారు. అసైన్డ్ భూములపై జరుగుతున్న అక్రమ లావాదేవీలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని ఆయన హెచ్చరిం చారు.మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, రెవెన్యూ రికార్డుల్లో ఒకరి పేరుపై ఉన్న అసైన్డ్ భూములను మరొకరు కొనుగోలు చేస్తే అమ్మిన వారిపైనే కాకుండా కొనుగోలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. ఇటువంటి లావాదేవీలు వెలుగులోకి వస్తే రిజిస్ట్రేషన్ల రద్దు నుంచి క్రిమినల్ కేసుల నమోదు దాకా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అసైన్డ్ భూములపై రోజువారీగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. చట్టపరంగా ఇవి బదిలీ చేయరాని భూములని తెలిసినా కొందరు అగ్రిమెంట్లు, విక్రయలేఖలు పేరుతో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "అసైన్డ్ భూములపై చేసే అగ్రిమెంట్లు, విక్రయ పత్రాలు చెల్లవు. వాటికి చట్టబద్ధత లేదు" అని తేల్చిచెప్పారు.కొన్ని గ్రామాల్లో అసైన్డ్ భూముల కొనుగోలు--విక్రయాల వ్యవహారం తీవ్ర వివాదాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా లావాదేవీకి ముందు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు .రైతులకు జీవనోపాధి కోసం ఇచ్చిన భూములను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలు మానుకోవాలని తహసీల్దార్ గట్టిగా హెచ్చరించారు. ఇప్పటికైనా అసైన్డ్ భూముల విషయంలో చట్టాన్ని గౌరవించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి





## -చైర్మన్ అబ్దుల్ గఫార్

### చేతులు శుభ్రత ఆరోగ్యానికి భద్రత

కనిగిరి స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మార్కాపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యంశాఖ సహకారంతో కనిగిరి పట్టణం లోని పి ఎం శ్రీ జెడ్ పి పి ఉన్నత బాలికల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మంగళవారం వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రెండు నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులందరూ అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలన్నారు. ఈ మాత్రల వల్ల ఏవిధమైన ఇబ్బందులు ఉండవని, ఒకవేళ ఏవైనా ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా పాఠశాలకు రాకపోతే వారికి మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు.పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వెంకట ఫణి కుమార్, డాక్టర్ ప్రియర్శనందా మాట్లాడుతూ నులిపురుగులు సోకిన పిల్లలు,కిశోర బాలలు ప్రమా దకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా అల్బెం డజోల్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయని చెప్పారు.ప్రభుత్వ అందించే ఈ మాత్రలు వేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు చేతులు శుభ్రత పై అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి,ఉపాధ్యాయులు,కనిగిరి పట్టణ టి డి పి అధ్యక్షులు షేక్ ఫిరోజ్,ఒంగోలు పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి షేక్ షరీఫ్, బి సి సెల్ అధ్యక్షులు పెన్నా వెంకటేశ్వర్లు, తెలుగు మహిళా నాయకురాలు తులసి, టి డి పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం



కనిగిరి స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

కనిగిరి పట్టణంలోని పి ఎం శ్రీ జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలు, అలాగే ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం ఉండే చట్టపరమైన శిక్షలు గురించి క్లుప్తంగా విద్యార్థులకు క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్ పాల్గొని మాట్లాడుతూ చెడు స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిళ్లు డ్రగ్స్ వైపు తీసుకెళ్లే విధానంపై విద్యార్థులకు మార్గదర్శనం ఇవ్వడం జరిగింది.మాదక ద్రవ్యాల వినియోగం విద్య, భవిష్యత్ కెరీర్ మరియు కుటుంబంపై కలిగించే ప్రతికూల ప్రభావాలను వివరించడం జరిగింది.పాఠశాల మరియు పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఏ అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి తెలియజేయాలని సూచించడమైనది. గంజాయి, గుట్కా, సిగరెట్లు వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దీర్ఘకాలిక ఆరోగ్యపరమైన ప్రమాదాలపై అవగాహన కల్పించడమైనది.పొగాకు ఉత్పత్తుల వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, మానసిక సమస్యలు వస్తాయని వైద్యులు డాక్టర్ వెంకట ఫణి, డాక్టర్ ప్రియర్షనందా తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,గుడ్ హెల్ప్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డక్కిలి తాసిల్దార్ కార్యాలయంలో కొత్త సేవలు,

## డీఏలు,వీఆర్వోలు తో సమావేశం



స్వర్ణ సాగరం ప్రతినిధి డక్కిలి

తిరుపతి జిల్లా డక్కిలి మండల తహసీల్దార్ కార్యాలయంలో కొత్త సేవలు మరియు ఇతర రెవెన్యూ అంశాలపై మంగళవారం డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో డీఏలు, వీఆర్వోలు సమావేశం నిర్వహించబడింది.తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ నూతన సేవలను ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. భూ వివాదాలు, పహాణీలు, ఆదాయ–జాతి–నివాస ధృవపత్రాల జారీ వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని ఆయన స్పష్టంచేశారు,ఈ సమావేశంలో మండలంలోని డీఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# శ్రీ జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పణ



కాణిపాకం స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

కాణిపాకం దేవస్థానం నుండి శివయ్య బ్రహ్మోత్సవాలకి పట్టు వస్త్రాలు సమర్పణ.కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నుండి శ్రీ జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం, కాళహస్తి స్వామివారికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నుండి శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , మరియు దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి , ఈ.వో బాపిరెడ్డి , ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం బోర్డు సభ్యులు నాగరాజు నాయుడు, శివప్రసాద్, నరేష్, సతీష్, వసంతమ్మ, కృష్ణవేణి, చంద్రకళ, అనసూయ, శ్రీవాణి, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యులు, కాణిపాకం దేవస్థానం సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ పరుశురామేశ్వర స్వామి గిరిప్రదక్షిణ..

ఏర్పేడు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17



మండలంలోని గుడిమల్లం శ్రీ పరశు రామేశ్వర స్వామి గిరి ప్రదక్షణ కార్యక్రమం లో భాగంగా గోవిందవరం గ్రామంలోమండల టిడిపి అధ్యక్షులు పేరం నాగరాజా నాయుడు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించార,ఈ కార్యక్రమం లో పేరం ధనం జయులు నాయుడు గుడిమల్లం గుడి ఛైర్మన్ బత్తల గిరి నాయుడు బాలాజ నాయుడు శివశంకర్ రెడ్డ పాపిరెడ్డి పున్నారావు ,సూరినా యుడు బాబు నాయుడుచిరంజీవులు నాయుడు మరియు మణి నాయుడు, రమేష్, భూపతి నాయుడు సురేంద్ర, చలపతి, మహేష్,భాస్కర్,దొరస్వామి ,మునికృష్ణ,సురేష్, కేక్ రమణ, రాచటి సుబ్రహ్మణ్యం, క్రిష్ణప్ప మొదలియర్, సీతపతి ఆచారి, దినకర్ నాయుడు , సుధాకర్ నాయుడు వై. మనోహర్ నాయుడు, మరియు వివిధ గ్రామాల ప్రజలు మండల కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

## ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ సుభాష్ చంద్రబోస్



ఏర్పేడు స్వర్ణసాగరం ఫిబ్రవరి 17

పిల్లారిగుంట ఎస్టి కాలనీ నందు ప్రగతి సంస్థ మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేట్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో దేవుడి పెళ్లి రోజున ప్రతి యేటా సామూహిక వివాహాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆది దంపతులకు పెళ్లి జరిపే రోజు వివాహాలు జరిగితే ఆ జంటలు కలకాలం ఆనందంగా, అన్యోన్యంగా ఉంటాయని ప్రజల విశ్వాసం. కానీ ఈ పర్వదినాన బాల్య వివాహాలు చోటు చేసుకోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. మన నమ్మకాలకు, విశ్వాసాలకు అమూల్యమైన బాల్యాన్ని బలి ఇవ్వడం (బాల్య వివాహాలు చేయడం) చట్ట రీత్యా నేరం. బాల్య వివాహలకు పాల్పడితే కుటుంబ సభ్యులు, బంధువులు, పూజారి మొదలు క్యాటరింగ్ చేసిన వారి వరకు ప్రతి ఒక్కరూ శిక్షార్హులే. 2009 నుంచి మాస్ మ్యారేజెస్ సందర్భంగా బాల్య వివాహల నిర్మూలన కొరకు ప్రగతి సంస్థ చేస్తున్న కృషి గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. శివరాత్రి దేవుడి పెళ్లి, సామూహిక వివాహాల సమయంలో పట్టణం నలుమూలలా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి గవర్నమెంట్ డిపార్టుమెంటులతో కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిత వాణి గారు క్మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాల గురించి, అంగన్వాడి సేవలు గురించి వివరించారు. బాల్య వివాహల వల్ల కలిగే ఆరోగ్య పరమైన, మానసిక సమస్యల గురించి, టీనేజి ప్రెగ్నెన్సీ గురించి, మాతా శిశు మరణాలు గురించి వివరించారు. చిన్న వయసులో ఆకర్షణలకు లోనై బాల్య వివాహాల బారిన పడకుండా పిల్లందరూ చక్కగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు బాల్య వివాహాలపై వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి, బాల్య వివాహాలపై ఉపేక్షించేది లేదు అన్నారు. ఈ కార్యక్రమంలోప్రగతి సంస్థ సిబ్బంది సుమలత రాజేశ్వరి, అంగన్వాడి టీచర్ తేజేశ్వరి గ్రామస్తులు మొదలగు వారు పాల్గొన్నారు.

# పోలీస్ కేసు నమోదు

**ముత్తుకూరు.. (స్వర్ణ సాగరం )** మండల కేంద్రంలో ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీస్ కేసు నమోదు చేశామని స్థానిక ఎస్సై ప్రసాద్ రెడ్డి మంగళవారం తెలిపారు. కృష్ణపట్నంలో మహాశివరాత్రి వేడుకలకు చెక్క రిక్షా పైవెళు _న్నసీతమ్మ ,వెంకటరమణయ్య, ముత్యాలయ్య, పోలమ్మలను గుర్తుతెలియని ఆటో ఢీకొనగా గాయపడిన నేపథ్యంలో పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై అన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం

## మండలంలో 12,795 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



ముత్తుకూరు.. (స్వర్ణ సాగరం )

జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో 12,795 మంది అర్హులైన పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవి కృప తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దేవి కృప విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని 68 అంగన్వాడీ కేంద్రాలు, 83 ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలు, 6 జూనియర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలు నులిపురుగుల బారిన పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా రక్తహీనత, పోషకాహార లోపం, చదువులో ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని డాక్టర్ దేవి కృప వివరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ ఉన్నతాధికారి మధుసూదన్, కళాశాల ప్రిన్సిపల్ సుజాత, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ శుభ్రత, చేతులు కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై సూచనలు అందించారు.

# జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. ఫిబ్రవరి 17



బంగారుపాలెం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలు అంగన్వాడి కేంద్రాల నందు జాతీయ నులిపు రుగుల దినోత్సవం పురస్కరిం చుకుని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చంగల్ రాయన్ ఆధ్వర్యంలో మండలంలోని 108 పాఠశాలు 91 అంగన్వాడి కేంద్రాలు 2 కాలేజీలు మొత్తం పిల్లలు13095 గాను 12797 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందని డాక్టర్ లోహిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ నాగేశ్వరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 2/17/2026 11:14 PM Page 3



# దక్కిలి మండలంలో సహకార సమ్మె సైరుణ్ మ్రోగింది

## రైతులు కు ఈ సమ్మె కారణంగా సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి





**స్వర్ణ సగరం దక్కిలి( ఫిబ్రవరి 17)**

తిరుపతి జిల్లా దక్కిలి మండలంలో సహకార సంఘాల ఉద్యోగులు, చేపట్టిన సమ్మెమరింతఉ ధృతమైంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని,కోరుతూ ఉద్యోగులు మండల కేంద్రంలోని సహకార సంఘాల కార్యాలయాల ముందుధర్నాలు, నిరసనలు, నోటీసులు ఇవ్వడం, కార్యాలయాలు మూతపడ్డాయి .కార్యక్రమా లునిర్వహించారు.ప్రభుత్వంపై ఒత్తిడితీసుకురావడమే, లక్ష్యంగా ఈసమ్మెకొనసాగిస్తున్నట్లు,సంఘాలనాయకులుతెలిపారు.అదే విధంగాఉద్యోగులునినాదాలతోమార్మోగించారు. “మా హక్కులు -- మా పోరాటం”, “వేతన సవరణలు వెంటనే అమలు చేయాలి”, “పెండింగ్ బకాయిలు చెల్లించాలి” అంటూ ప్రభుత్వానికి హెచ్చరిక లు జారీ చేశారు.మండలంలో పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నసమస్యలను,పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.ప్రధానడిమాం డ్లుపెండింగ్ వేతన బకాయిల, తక్షణ చెల్లింపు,సహకార సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రైతులకు రుణాల మంజూరు, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు, వంటి సేవలు, ఈ సమ్మె కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కొన్ని సేవల కోసంఇబ్బందులుపడుతున్నారు.దక్కిలి మండలంలో తెలుగుదేశం సినీయర్ నాయకులు, మాధవాయపాలం సొసైటి అధ్యక్షులుఏలేశ్వరం. రామచంద్రయ్య నాయుడు, అదేవిధంగా రాజ, చైతన్య రెడ్డి, మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను, పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిదంగా “సహకార సంఘాల ఉద్యోగులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివారు. వారి సమస్యలనుత్వరగాపరిష్కరించకపోతే గ్రామీణ సేవలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది” అని వారు పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగస్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.దక్కిలి మండలంలో ఏడు సహకార సంఘాలు ఈ సమ్మె లో పాల్గినడం జరిగింది. ఈ సమ్మెలో పాల్గొన్న ప్రభావం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందా,అన్నది అందరిలోఆ సక్తినిరేకెత్తిస్తోంది.నాదాలతోమార్మోగించారు. “మా హక్కులు -- మా పోరాటం”, “వేతన సవరణలు వెంటనే అమలు చేయాలి”, “పెండింగ్ బకాయిలు చెల్లించాలి” అంటూ ప్రభుత్వానికిహెచ్చరిక లుజారీచేశారు. మండలం లో పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, సంవత్సరాలుగాపెండింగ్‌లోఉన్నసమస్యలను,పరిష్కరించకుండాకాలయాపనచేస్తున్నారనిఆరోపించారు.ప్రధాన డిమాండ్లుపెండింగ్ వేతన బకాయిల, తక్షణ చెల్లింపుప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలుకాంట్రాక్ట్ ఉద్యోగుల శాశ్వతీకరణపదోన్నతుల్లో పారదర్శక విధానంరిటైర్మెంట్ ప్రయోజనాలపూర్తి అమలుసహకార సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రైతులకు రుణాల మంజూరు, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు, వంటి సేవలు, ఈ సమ్మె కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కొన్ని సేవల కోసంఇబ్బందులుపడుతున్నారు.దక్కిలి మండలంలో తెలుగుదేశం సినీయర్నాయకులు,మాధ వాయపాలంసొసైటిఅధ్యక్షులుఏలేశ్వరం.రామచంద్రయ్య నాయుడు, అదేవిధంగా మండలంలో సొసైటి అధ్యక్షులురం గినేని. రాజ,కాసారం. చైతన్యరెడ్డి,పులి.జనార్ధన్రెడ్డి,నర్రావుల. బాస్కర్ నాయుడు, వెలికింటి.రమణారెడ్డి,ఈత ముక్కల .సురేంద్ర నాయుడు, మీడియా తో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను, పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిదంగా “సహకార సంఘాల ఉద్యోగులు గ్రామీణఆర్థికవ్యవస్థకువెన్నెముకలాంటివారు. వారిసమస్యల నుత్వరగాపరిష్కరించకపోతే గ్రామీణ సేవలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది” అని వారు పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగస్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకుసమ్మెకొనసాగుతుందని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.దక్కిలి మండలంలో ఏడు సహకార సంఘాలు ఈ సమ్మె లో పాల్గొనడం జరిగింది. ఈ సమ్మెలో పాల్గొన్న ప్రభావం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందా,అన్నది అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# శ్రీసిటీలో మరో దిగ్గజ ఏసీ కంపెనీ..

## క్యారియర్ కొత్త తయారీ యూనిట్‌కు లీజ్ ఒప్పందం







**శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17, 2026:**

గ్లోబల్ హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ (ఎహెచ్‌వీఏసీ) రంగంలో అగ్రగామిగా ఉన్న క్యారియర్ ఎయిర్‌కండిషనింగ్ & రిఫ్రిజరేషన్ లిమిటెడ్ సంస్థ శ్రీసిటీలో కొత్త తయారీ కేంద్రం స్థాపనకు లీజ్ డీడ్‌పై సంతకం చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో క్యారియర్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.ఈ సందర్భంగా డా. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మాత్రమే కాకుండా వేగవంతమైన అమలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి కట్టుబడి ఉందని తెలిపారు. శ్రీసిటీ ఎహెచ్‌వీఏసీ రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, క్యారియర్ పెట్టుబడి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు .స్థిరమైన, శక్తి-సమర్థ వాణిజ్య శీతలీకరణ పరిష్కారాలకు పెరుగుతున్న డిమాండ్‌ను శ్రీసిటీ ఫ్యాక్టరీ తీర్చడమే కాకుండా, స్థానిక ప్రతిభకు అర్థవంతమైన అవకాశాలను కల్పిస్తుంది. ఈ ప్లాంట్ పచ్చదనం ఆధారిత తయారీ విధానాలను అనుసరించి, గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించి, క్యారియర్ సంస్థకు విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని అందించి, మార్కెట్ వృద్ధికి తోడ్పడుతుందని సుందరేశన్ నారాయణన్ అన్నారు.డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, క్యారియర్ పెట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో రాష్ట్ర పారిశ్రామిక వాతావరణంపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరిగి, ఆధునిక తయారీ మరియు సుస్థిర ఆవిష్కరణల కేంద్రంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు .ఈ ఒప్పందానికి ముందు ఇటీవల క్యారియర్ ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ లను సంప్రదించి ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఏసీ పరిశ్రమలకు మంచి అనుకూల వాతావరణం కలిగిన శ్రీసిటీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో భారతదేశంలో క్యారియర్ సంస్థ ఉనికి మరింత బలపడనుంది. ఇప్పటికే హర్యానాలో ఉన్న తమ తయారీ కేంద్రానికి తోడుగా ఈ కొత్త యూనిట్ పనిచేస్తూ, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక సుస్థిర వృద్ధితో పాటు మార్కెట్‌లో నాయకత్వ స్థానాన్ని మరింత విస్తరించనున్నట్లు క్యారియర్ సంస్థ పేర్కొంది.

# నులి పురుగులు మాత్ర లువాడండి మానసిక ఉల్లాసంతో జివించండి డాక్టర్ ప్రియాంక



**పూతలపట్టు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17**

పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవ సందర్భంగా పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం ఒక మాత్రతో నులిమేయ్ అనే నినాదం తో పిల్లలకు ఆల్బండాజోలు మాత్రలను మండల విద్యాధికారి మధుసూదన్ కలసి మింగించారు ఆల్బండాజోలు మాత్రలు తినడం వల్ల కడుపులో ఉన్న నులి పురుగులు పోతాయని పిల్లలు ఆరోగ్య వంతంగా మానసిక ఉల్లాషంగా ఉంటారని తిలిపారు కొందరికి తరుచు కడుపు నొప్పి వస్తుంటదని ఎక్కువ అనారోగ్యం పాలు అవుతారని ఈమాత్రవల్ల అలాంటి బాధ ఉండదని తెలిపారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇస్తామని తెలిపారు చేతులు ఎలా సుబ్రపరుచుకోవాలని తెలిపారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 3181 మందికి 3095 మంది పిల్లలకు వేశామని 97% సేశామని మిగిలిన 3 % 24 న పూర్తి సేస్తామని వైద్యాధికారి తెలిపారు ఈకార్యక్రమంలో మండల ఉప అభివృద్ధి అధికారి శ్రేనివాసులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఎం ఎల్ హెచ్ఈఓ నరసింహ ప్రసాద్ హెచ్ ఎస్ నూర్జహాన్ ఉపాధ్యాయులు ఆరోగ్య కార్యకర్త దేవి ఆశలు విజయ ఫర్హాన పాల్గొన్నారు

# జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా మండలంలోని ప్రతి అంగన్వాడీ లోను ప్రతి పాఠశాలలోనూ ప్రైవేటు పాఠశాలల్లోనూ ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరములు పిల్లలందరికీ సోమవారం నులిపురుగుల నివారణ టాబ్లెట్ ఆల్బెండజోలును నమిలి మింగించడం జరిగింది. స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, మండల టిడిపి కన్వీనర్ సుధాకర్ నాయుడు, ఎంఈఓ 2 సుబ్రమణ్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య , అంగన్వాడి సూపర్వైజర్ యమునా పాఠశాల ఉపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది ఆశాలు మొదలగు పాల్గొని పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించడం అయినది. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రపరచుకోవడము శుభ్రమైన ఆహారము నీరు తీసుకోవడం ద్వారా ఈ నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. మల్ల విసర్జన తరువాత ఆహారము తీసుకునే ముందు మట్టిలో ఆటలాడుతున్న తర్వాత మట్టి పనులు చేసేవారు ఇతరులకు ఆహారము వడ్డించే ముందు చేతులను పద్ధతి ప్రకారం శుభ్రం చేసుకోవడం ద్వారా ఈ నులిపురుగులను నిర్మూలించుకోవచ్చు. పరిసరాల పరిశుభ్రతను పాటించడము చేతుల శుభ్రత పాటించడము శుభ్రమైన ఆహారము నీరు తీసుకోవడం ద్వారా ఎన్నిటిపురుగులను నివారించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో 58 అంగన్వాడీ కేంద్రాలలో 50 ప్రభుత్వ పాఠశాలల్లోనూ 6 ప్రభుత్వ పాఠశాలల్లోనూ 6344 మంది పిల్లలకు ఈ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించడం అయినది. ఈరోజు ఆబ్సెంట్ అయినవారికి 24 వ తారీఖున మింగిస్తారని తెలపడమైనది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది ఆశాలు పాఠశాల ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం జరిగినది.

# జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి ప్రవేట్ పాఠశాలల సమస్యలపై అసోసియేషన్ల విజ్ఞప్తి





**నెల్లూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17**

నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్లు మంగళవారం జిల్లా విద్యాశాఖఅధికారి దృష్టికి తమ సమస్యలను ప్రధానంగా 12 సి రిజిస్ట్రేషన్ గురించిఏకరువు పెట్టారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25% పేద విద్యార్థులను చదివించే 12.1(సి) ప్రవేశాలపై రాబోవువిద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ఆపాలని నిర్ణయించిన విషయాన్ని డీఈఓ దృష్టికి తెచ్చారు పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఒక్కొక్క విద్యార్థికి 13000 అందిస్తామని చెప్పినప్పటికీ గత నాలుగు సంవత్సరాలుగా చెల్లింపులు జరగలేదన్నారు. కానీ అడ్మిషన్లు తీసుకోవాలని ఒత్తిడి చేయడం జరుగుతుందన్నారు దీంతోపాటు ఉపాధ్యాయుల వివరాలను సేకరించే క్రమంలో వారి పేరు అర్హత ఆధార్ జీతము పాన్ కార్డు అప్లోడ్ చేయాలని ఒత్తిడి చేయడాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు రెన్యువల్ విషయంలో అనేక నిబంధనలు జీవోలు ఇవ్వకుండా ఆంక్షలు పెడుతున్నారని గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులు ఉన్నత చదువులు చదువుకొని సొంత డబ్బుతో పాఠశాలను నిర్మించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తూ అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న చిన్న ప్రైవేట్ పాఠశాలలకు ఈ నిబంధనలు ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలిపారు పైన పేర్కొన్న అత్యంత క్లిష్టసమస్యలు పరిష్కరించి ప్రైవేట్ పాఠశాలల నిర్వహణను కాపాడాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. డీఈఓ ను కలిసిన వారిలో అపస్మా రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ భాష స్టేట్ అడ్వైజర్ వెంకట్రామయ్య జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ జనుల ట్రెజరర్ కృష్ణారావు అపస్మా సిటీ ప్రెసిడెంట్ కొండారెడ్డి అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి 30 మంది కరస్పాండెంట్లు పాల్గొన్నారు

# పాలమిత్రాలకు మార్గదర్శకం శ్రీజ డైరీ ఆధ్వర్యంలో, అవగాహన--రిఫ్రెష్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహణ,




**స్వర్ణసాగరం- తొట్టంబేడు,**

తొట్టంబేడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పాలమిత్రాల కోసం అవగాహన--రిఫ్రెష్మెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీజ డైరీ ఆధ్వర్యంలో, జైకా సంస్థ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తి నాణ్యత, పశుసంరక్షణ, యంత్రాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఏరియా ఆఫీసర్ విశ్వనాధం, పీఐబీ ఎగ్జిక్యూటివ్ చెంచు మోహన్, శ్రీకాళహస్తి ఏరియా సూపర్‌వైజర్ అమీర్ బాషా, ఏర్పేడు ఏరియా సూపర్‌వైజర్ సుబ్రమణ్యం రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సంపత్ హాజరయ్యారు. పాలమిత్రాల బాధ్యతలు, స్వచ్ఛమైన మరియు నాణ్యమైన పాల సేకరణలో పాటించాల్సిన ప్రమాణాలు, పాలలో కల్తీ నివారణ చర్యలు వంటి అంశాలను వివరించారు.పాలు కొలిచే యంత్రాల సక్రమ నిర్వహణ, దైనందిన శుభ్రత, సాంకేతిక లోపాల నివారణపై టెక్నీషియన్ చెంచు బాబు ప్రాయోగికంగా వివరించారు. రాబోయే వేసవి కాలంలో పశువులకు తాగునీటి సమృద్ధి, నీడ, పోషకాహారం, వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వెటర్నరీ సిబ్బంది స్పష్టంచేశారు.ఈ సందర్భంగా చెంచు మోహన్ మాట్లాడుతూ, నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) సహకారంతో శ్రీజ సంస్థ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 65 శాతం పైగా మార్కులు సాధించిన పాల ఉత్పాదక కుటుంబాల విద్యార్థులకు రూ.20,000 స్కాలర్షిప్ అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పాల ఉత్పాదక కుటుంబాలకు విద్యా ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమం అనంతరం ఏరియా ఆఫీసర్ విశ్వనాధం పాలమిత్రాలకు ఎగ్జిక్యూటివ్ బ్యాగులు, హాట్ వాటర్ బాటిళ్లు, 2026 సంవత్సరానికి సంబంధించిన శ్రీజ డైరీలను పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలానికి చెందిన పాలమిత్రాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కైలాసగిరి ప్రదక్షణకు కొత్త నిబంధనలు,

## మధ్యాహ్నం 2 గంటల వరకు వాహనాల రాకపోకలకు నిలుపుదల,

## ప్రశాంత వాతావరణంలో గిరి ప్రదక్షణకు అధికారుల చర్యలు,

**శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం, స్వర్ణసాగరం – శ్రీకాళహస్తి,**

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి గిరి ప్రదక్షణ ఈ నెల 19న భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.గతంలో ప్రదక్షణ సమయంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలు గిరి ప్రదక్షిణ మార్గంలో సంచరించేవి. దీంతో రద్దీ, శబ్ద కాలుష్యం, భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు భక్తులు విన్నవించారు.ఈ నేపథ్యంలో ఆలయ సిబ్బంది, పోలీసు అధికారులు సమిష్టిగా సమీక్ష నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల వరకు గిరి ప్రదక్షిణ రోడ్డులో ఎటువంటి వాహనానికీ అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించారు. అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.స్వామి అమ్మవార్లను ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేలా, అల్లర్లు, శబ్దాల నుండి దూరంగా భక్తులు భక్తి భావంతో ప్రదక్షణ నిర్వహించుకునేలా ఈ చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.ప్రజలు, భక్తులు, వ్యాపారులు, వాహనదారులు సహకరించి నిర్ణయాన్ని విజయవంతం చేయాలని ఆలయ అధికారులు, పోలీసు శాఖ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 2/17/2026 11:14 PM Page 4



## అబాకస్ మరియు వేదిక మాథ్స్ కాంపిటీషన్లో ఓం నారాయణ విద్యార్థుల ప్రతిభ...



ఏర్పేడు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

తిరుపతిలో మంగళవారం శ్రీరామ విద్యా మందిర్ స్కూల్ నందు జరిగిన వేదిక్ మాథ్స్ మరియు అబాకస్ డిస్ట్రిక్ట్ లెవెల్ కాంపిటీషన్లో ఓం నారాయణ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.వేదిక మాథ్స్ కాంపిటీషన్ నందు జి. లక్ష్మీ నరసింహ రన్నర్ గా విజయం సాధించారు. అబాకస్ జూనియర్ లెవెల్ వన్ నందు ఏ. భవిష్య ఫస్ట్ ప్లేస్ విన్నర్ గా విజయం సాధించారు.అబాకస్ సీనియర్ కాంపిటీషన్ లెవెల్ వన్ నందు సి. నిఖిల్ థర్డ్ ప్లేస్ విన్నర్ గాను, గెలుపును సొంతం చేసుకున్నారు.అబాకస్ మరియు వేదిక మాథ్స్ పై విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చిన డి.బుజ్జమ్మ ఏ.అశ్విని టీచర్స్ కి కాంపిటేషన్లో పాల్గొన్న విద్యార్థులకు మరియు దీన్ని సహరించినటువంటి వారి తల్లిదండ్రులకు ఓం నారాయణ స్కూల్ కరస్పాండెంట్ చింత మోహన్ అభినందనలు తెలియజేశారు.

## నాయుడుపేట అర్బన్ సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ.



స్వర్ణ సాగరం (నాయుడుపేట)పిబ్రవరి 17.

నాయుడుపేట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా వెంకటేశ్వర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.గతంలో ప్రకాశం జిల్లా పొదిలిలో సీఐగా పనిచేసిన ఆయన, అక్కడి నుండి వీఆర్ కు వెళ్లారు.తాజాగా ప్రభుత్వం జరిపిన బదిలీల్లో భాగంగా నాయుడుపేట అర్బన్ సీఐగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని,ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.ం

## డిమాండ్ల సాధనకై రెవెన్యూ సిబ్బంది ఆందోళన,

తొట్టంబేడు మండలంలో నిరసన కార్యక్రమం

-- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి,



స్వర్ణసాగరం- తొట్టంబేడు,

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో రెవెన్యూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొట్టంబేడు మండల కార్యాలయం వద్ద ఉప తహసీల్దారు, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు), గ్రామ సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను వెల్లడిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.సర్వీస్ నిబంధనల్లో స్పష్టత, పదోన్నతులు, ఖాళీల భర్తీ, విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

## పూతలపట్టు మండల వీఆర్ఏల ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎంపిక

పూతలపట్టు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

పూతలపట్టు మండలంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏల మంగళవారం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసుకోవడం జరిగింది. ఈ నూతన కమిటీలో కమిటీ అధ్యక్షులుగా పి కేశవులు. ఉపాధ్యక్షులు వరప్రసాద్. ప్రధాన కార్యదర్శి టి రాజేష్. కార్యదర్శి మాధవి. ఎస్.కె ఢిల్లీ జ. ఈ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు అదేవిధంగ అధికారులకు అందుబాటులో ఉండి అధికారులు చెప్పిన విధంగా నడుచుకుంటామని తాసిల్దార్ రమేష్ బాబు సార్ గారికి వినతి పత్రం అందించారు కార్యక్రమంలో వీఆర్ఏల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చిత్తూరు పట్టణము నందు ఒక యువకుడిపై జరిగిన దాడిలో కేసు నమోదు చేసిన పూతలపట్టు ఇన్స్పెక్టర్ శ్రీ డి.గోపి.

చిత్తూరు జిల్లా పోలీసు



**వివరాలు:**నిన్నటి దినం 16-02-2026 ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్న పసుపులేటి రాకేష్ అనే విద్యార్థిని, అదే కాలేజీలో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు సుబ్బారెడ్డి, నాయుడు, రాకేష్ లు గతంలో ఉన్న మనస్పర్థల కారణంగా మోటార్ సైకిల్పై తీసుకెళ్లి, చిత్తూరు పట్టణం కట్టమంచి సమీపంలోని ఒక గ్రౌండ్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి ముందుగానే వచ్చిన వంశీ, అఖిల్, బాబ్జి, శివారెడ్డి లతో కలిసి బాధితుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచడం జరిగింది.ఈ ఘటనకు సంబంధించిన వీడియో బాధితుడు ఈ రోజు విడుదల చేయగానే, పూతలపట్టు ఇన్స్పెక్టర్ గారు వెంటనే స్పందించి బాధితుడిని స్వయంగా సంప్రదించి వివరాలు సేకరించారు. అతని ఫిర్యాదు ఆధారంగా పూతలపట్టు పోలీస్ స్టేషన్లో జతీ.చీశీ: 20/2026 ఖ/ంవష 137 (2), 118 (1), 351(2), 127(6) దీచీూ తీ/ష 3(5) కింద కేసు నమోదు చేయడం జరిగింది.ఈ దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ గారు స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసులు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

## 786 రఫీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నచ్చిన బోయిన వెంకటసుబ్బయ్య (పండు).

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 17.



తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం నాయుడుపేట యూత్ లీడర్ మరియు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు 786 రఫీ జన్మదిన పురస్కరించుకొని తన కార్యాలయంలో మంగళవారం తన అభిమాని నక్కిన బోయిన వెంకటసుబ్బయ్య (పండు) మరియు తన మిత్రులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి పూల బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాలువ మూసేస్తే పంటలే కాదు... రైతు భవిష్యత్తే ఎండిపోతుంది!,

### డీకేటి భూములపై వెంచర్ యత్నం ఆందోళనకరం: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హెచ్చరిక,

స్వర్ణసాగరం- ఏర్పేడు,

ఏర్పేడు మండలం వికృతమాల పంచాయితీ పరిధిలోని డీకేటి అసైన్ భూములపై వెంచర్ ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు స్థానిక రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వ్యవహారంపై మంగళవారం ఉదయం సిపిఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య నేతృత్వంలో పార్టీ నాయకులు సంబంధిత భూభాగాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. భూముల సర్వే వివరాలు, కాలువ మార్గం, చెరువు ప్రవాహ దిశలను పరిశీలించిన అనంతరం పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.ప్రస్తుతం సర్వే నంబర్ 125గా ఉన్న భూములను 444గా మార్పులు చూపిస్తూ, 444-1, 444-2, 444-3గా విభజించి వెంచర్ వేయడానికి చర్యలు కొనసాగుతున్నట్లు సిపిఐ ఆరోపించింది. అసైన్ చేసిన భూముల బదిలీ, రిజిస్ట్రేషన్ చట్టపరంగా నిషేధితమైనప్పటికీ అనుమానాస్పదంగా ఎన్ఓసీలు పొందడం పలు అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అసైనడ్ ల్యాండ్స్ (ప్రోహిబిషన్ అఫ్ ట్రాన్స్ఫర్స్) యాక్ట్, 1977 మరియు జి.ఓ.వీం.చీశీ.215 (13-05-2016) ప్రకారం అసైన్ భూములపై హక్కుల మార్పిడి చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది.చెరువు నుంచి పంటకాలువలకు సహజంగా



వెళ్లే నీటి మార్గాన్ని బుడ్చి వెంచర్ అభివృద్ధి చేయాలనే ప్రయత్నం రైతుల జీవనాధారంపై నేరుగా దాడి చేసినట్లేనని జనమాల గురవయ్య విమర్శించారు. "కాలువ మూసేస్తే పంటలు ఎండిపోతాయి. పంటలు ఎండిపోతే రైతు అప్పుల పాలవుతాడు. చివరికి గ్రామ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ చర్యల వల్ల సాగునీరు అందక రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, భూగర్భ జలాలు మరింత దిగజారే ప్రమాదం ఉందని పార్టీ పేర్కొంది. చిన్న, సన్నకారు రైతులు ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాలువ మూసివేత వారి పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అదేవిధంగా తాగునీటి కొరత కూడా తలెత్తే అవకాశముందని హెచ్చరించింది.

పర్యావరణ పరంగా కూడా ఈ చర్యలు ప్రమాదకరమని సిపిఐ అభిప్రాయపడింది. చెరువు--కాలువల సహజ ప్రవాహ వ్యవస్థ ధ్వంసమైతే వర్షాకాలంలో వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని, పక్షులు, జలచరాలకు నివాస స్థలాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. భూమి సహజ స్వరూపం మారిపోవడం వల్ల భవిష్యత్ తరాలకు నష్టం కలుగుతుందని స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో సంబంధిత భూములపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించాలని, అక్రమ రిజిస్ట్రేషన్లు మరియు ఎన్ఓసీలను రద్దు చేయాలని, చెరువు--కాలువలను యథాస్థితికి తీసుకురావాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా కోరింది.ఇదిలా ఉండగా, ఈ అంశంపై మరింత సమగ్ర పరిశీలన కోసం సిపిఐ తిరుపతి జిల్లా నాయకత్వం రెండు--మూడు రోజుల్లో ప్రాంతాన్ని సందర్శించనుందని ప్రకటించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రైతులు, గ్రామ ప్రజలతో కలిసి బహిరంగ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో సిపిఐ రేణిగుంట మండల కార్యదర్శి వైయస్ మనీ, ఏర్పేడు మండల కార్యదర్శి సర్దార్ శివకుమార్, నాయకులు జనార్దన్, వినోద్, కార్తీక్, గోపి తదితరులు పాల్గొన్నారు.--

జనమాల గురవయ్య
సిపిఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి

## బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం.

ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నారాయణ

ఏర్పేడు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 17

ఏర్పేడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రగతి సంస్థ మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో దేవుడి పెళ్లి రోజున ప్రతి యేటా సామూహిక వివాహాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆది దంపతులకు పెళ్లి జరిపే రోజు వివాహాలు జరిగితే ఆ జంటలు కలకాలం ఆనందంగా, అన్యోన్యంగా ఉంటాయని ప్రజల విశ్వాసం. కానీ ఈ పర్వదినాన బాల్య వివాహాలు చోటు చేసుకోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. మన నమ్మకాలకు, విశ్వాసాలకు అమూల్యమైన బాల్యాన్ని బలి ఇవ్వడం (బాల్య వివాహాలు చేయడం) చట్ట రీత్యా నేరం. బాల్య వివాహలకు పాల్పడితే కుటుంబ సభ్యులు, బంధువులు, పూజారి మొదలు క్యాటరింగ్ చేసిన వారి వరకు ప్రతి ఒక్కరూ శిక్షార్హులే. 2009 నుంచి మాస్ మ్యారేజెస్ సందర్భంగా బాల్య వివాహల నిర్మూలన కొరకు ప్రగతి సంస్థ చేస్తున్న కృషి గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. శివరాత్రి దేవుడి పెళ్లి, సామూహిక వివాహాల సమయంలో పట్టణం నలుమూ లలా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి గవర్నమెంట్ డిపార్టుమెంటులతో కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపివో క్రిష్టవేణి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాల గురించి, అంగన్వాడి సేవలు గురించి వివరించారు. ఏర్పేడు మండల కోర్డనేటర్ శిరీష మాట్లాడుతూ బాల్య వివాహల వల్ల కలిగే ఆరోగ్య పరమైన, మానసిక సమస్యల గురించి, టీనేజి ప్రెగ్నెన్సీ గురించి, మాతా శిశు మరణాలు గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ చిన్న వయసులో ఆకర్షణలకు లోనై బాల్య వివాహాల బారిన పడకుండా పిల్లందరూ చక్కగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ూఔజసూపర్వైజర్ రత్నం



మాట్లాడుతూ బాల్య వివాహాలపై వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి, బాల్య వివాహాలపై ఉపేక్షించేది లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పిల్లలు,ప్రగతి సంస్థ సిబ్బంది చంద్ర శేఖర్, , వెంకటేష్,మురగయ్య, మొదలగు వారు పాల్గొన్నారు

## నేడు నాయుడుపేట పట్టణ అధ్యక్షులు 786 రఫీ పర్యటన వివరాలు.



తెలుగుదేశం పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు 786 రఫీకి జన్మదిన శుభాకాంక్షలు.

786 సేవా సంఘం ఆధ్వర్యంలో నేడు పలు కార్యక్రమంలో 786 రఫీ పాల్గొంటారు.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 17.


తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో 18/02/206 అనగా బుధవారం మన ప్రియతమ నాయకులు నాయుడుపేట టిడిపి పట్టణ అధ్యక్షులు మరియు నాయుడు పేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ జన్మదినాన్ని పురస్కరించుకొని 786 సేవా సంఘం ద్వారా పలుచోట్ల పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని 786 సేవా సంఘం తెలియజేశారు.ఉదయం 10:30 గం లకు సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మరియు నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు చేతుల మీదుగా నాయుడుపేటలో ఉన్నటువంటి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోదరులకు,శానిటేషన్ మేస్త్రులకు, హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం జూ తేజ సెంటర్ నాయుడుపేట వద్ద జరుగుతుందని అన్నారు. అదేవిధంగా 11:30 గం లకు నాయుడుపేట లోని ప్రభుత్వ ఆసుపత్రి నందు అక్కడ చికిత్స పొందుతున్నటువంటి రోగులకు పండ్లు మరియు బ్రెడ్ ప్యాకెట్లు అందజేయబడును. మరియు12:00 గం నాయుడుపేట అన్న క్యాంటీన్ నందు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును. అదేవిధంగా సాయంత్రం:6:30 గం లకు 786 రఫీ గారి నివాసం నందు కేక్ కటింగ్ మరియు మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయబడింది. అలాగే అందరికీ డిన్నర్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది.కావున పతి ఒక్కరూ విచ్చేసి 786రఫీ ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాం. అన్ని 786 ఫ్యామిలీ అండ్ యూత్ తెలియజేశారు.

## వైభవంగా ముగిసిన కృష్ణపట్నం మహాశివరాత్రి మహోత్సవాలు.

చివరి రోజు అన్న లింగ ప్రతిష్ట, అన్న లింగ నిమజ్జనం, గంగమ్మ ఉత్సవం.

వేలాది మందికి అన్నదాన కార్యక్రమం.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు.



స్వర్ణ సాగరం ,( ముత్తుకూరు)

కృష్ణపట్నం గ్రామంలోని కామాక్షి దేవి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన ప్రారంభమైన మహాశివరాత్రి మహోత్సవాలు చివరి రోజు మంగళవారం నాటికి ముగిసాయి. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో నిర్వహించారు. రెండు రోజులపాటు విశేష పూజలు, గ్రామోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు విశేషమైన పూజలు, హోమములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సిద్దేశ్వర స్వామికి అన్న లింగ ప్రతిష్ట, అన్న లింగ నిమజ్జనం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం శోభయ మానంగా మారింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, శివ నామ స్మరణ తో కార్యక్రమాలు జరిగినాయి. వేలాది మంది భక్తుల మధ్య ఆలయ అధికా రులు కార్యక్రమాలు చేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ మామిడాల శ్రీనివాసులు , ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి గిరి కృష్ణ, పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు సంయుక్తంగా కార్యక్రమం ఏర్పాట్లు పర్యవేక్షణ చేశారు. అదేవిధంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. శివ భక్తులు రాగాల శివకృష్ణ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లయికుంట తండ గ్రామంలో ఘనంగా కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు

సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు



స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 17

బిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, 72వ పుట్టినరోజు వేడుకలను మండల సోషల్ మీడియా కన్వీనర్ బానోత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ ఆదేశాల మేరకు మంగళవారం డోర్నకల్ మండలంలోని మల్లయి కుంట తండా గ్రామంలో భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచ పేల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్,మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను కొనియాడారు. సబండ వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రాష్ట్రాన్ని సాధించారని, తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధి పథంలో నడిపారని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచిందన్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతుబంధు పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి వంటి పథకాల ద్వారా అండగా నిలిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఫుల్ సింగ్. రాయి గూడెం ఉప సర్పంచ్ ఆదినారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు నంద నాయక్,చిర్ర వెంకన్న ,దానియకుల వెంకటేశ్వర్లు. రాంబాబు,రావి నాయక్,యూత్ నాయకులు,బాబు నాయక్. కపిల్ నాయక్, నరేష్ నాయక్, యం రాంబాబు, నాగరాజు, స్వామి, సేవలు, రావి దుబ్ సింగ్, రాజేష్, బిల్య నాయక్, చందు, వీరన్న,టీ బాబు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు

## బైకును ఢీకొన్న కారు ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 17.



నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెళ్లకూరు వద్ద మంగళవారం ఉదయం మోటార్ బైక్ ను కారు ఢీకొన్నది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న కారు ముందు వెళుతున్న బైకును వేగంగా ఢీకొనడం జరిగింది . వివరాల్లోకి వెళితే తొట్టంబేడు మండలం ఎగువ కొణతనేరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, చెంచు రెడ్డి శ్రీకాళహస్తి నుంచి బైకులో నాయుడుపేటకు వెళ్లుతున్నారు. వెనుక నుంచి కారు వేగంగా ఢీకొనడంతో బైక్ మీద ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు 1033 అంబులెన్స్ ద్వారా శ్రీకాళహస్తి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ప్రమాదాన్ని గల కారణం అతివేగమని తెలిపారు.



## నేను కేవలం కమర్షియల్ బొమ్మలా మిగిలిపోవాలని అనుకోలేదు

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి రెజీనా కసాండ్రా.. తన నటనతో, చురుకైన మాటలతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయాలనే ఉద్దేశంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మకు అక్కడ చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 2019లో 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసాలగా' సినిమాతో హిందీ తెరకు పరిచయమైన రెజీనా, అక్కడి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి నిశ్శబ్ద పోరాటం చేస్తూనే ఉంది. తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తనకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంది. "నేను సౌత్ ఇండియా నుంచి వచ్చాననే కారణంతో నన్ను ఒక మూసలో బంధించారు. నిజానికి చాలామంది ఉత్తరాది వారికంటే నా హిందీ చాలా స్పష్టంగా ఉంటుంది. నేను హిందీ రాయగలను, చదవగలను, అనర్గళంగా మాట్లాడగలను. నా ప్రతి సినిమాకు నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పుకుంటాను. అయినప్పటికీ, నన్ను అక్కడ ఒక పరాయి వ్యక్తిలా చూశారు" అని రెజీనా తన ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం మాటలతోనే కాకుండా, కొందరు తమ ప్రవర్తనతో కూడా తనను తక్కువ చేసి చూపిస్తూ కించపరిచేవారని, ఇది తన మనసును ఎంతో గాయపరిచిందని ఆమె వాపోయింది. ముఖ్యంగా ఉత్తరాది నటీమణులు దక్షిణాది సినిమాల్లో సులభంగా పాత్రలు దక్కించుకుంటుంటే, దక్షిణాది నటీమణులు మాత్రం హిందీలో పంజాబీ లేదా నార్త్ ఇండియన్ పాత్రలు చేయలేరనే ముద్ర వేయడం అన్యాయమని ఆమె ప్రశ్నించింది.

## నన్ను రాజకీయాల్లోకి లాగొద్దు..



యాక్టర్ త్రిష తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నాగేంద్రన్ విజయ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ నటి త్రిష పేరును వివాదంలోకి లాగడం తీవ్ర దుమారం రేపింది. విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీపై విమర్శలు చేసే క్రమంలో, "విజయ్ ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు వచ్చి రాజకీయాలు చేయాలి" అంటూ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై నటి త్రిష సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. "గౌరవం లేని ప్రవర్తనను ఎప్పుడూ ప్రశ్నించాలి" అని పేర్కొంటూ ఆమె ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇంత అసభ్యంగా, ఒక మహిళా నటి వ్యక్తిగత జీవితాన్ని కించపరిచేలా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును వాడుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని త్రిష ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై రాజకీయ వర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. డీఎంకే ఎంపీ కనిమొళి, ఇతర మహిళా సంఘాల నేతలు నైనార్ నాగేంద్రన్ తీరును తప్పుబట్టారు. మహిళల పట్ల ఇలాంటి 'గుటర్ పాలిటిక్స్' (నీచ రాజకీయాలు) చేయడం బీజేపీ సంస్కృతికి నిదర్శనమని వారు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కూడా త్రిషకు మద్దతుగా నిలుస్తూ, నాగేంద్రన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, బీజేపీ శ్రేణులు మాత్రం ఈ వ్యాఖ్యలను ప్రత్యర్థి పార్టీలు కావాలనే వక్రీకరిస్తున్నాయని సమర్థించుకుంటున్నారు.



## 'హే బలవంత్' లాంటి సినిమా కోసం ఎదురుచూశాను: హీరో సుహాస్

ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి', 'ఈషా' వంటి వరుస విజయాలను అందుకున్న సక్సెస్‌ఫుల్ ద్వయం బన్నీ వాస్, వంశీ నందిపాటి తాజాగా నిర్మించిన చిత్రం 'హే బల్‌వంత్'. గతంలో 'హే భగవాన్'గా ప్రకటించిన ఈ చిత్ర టైటిల్‌ను తాజాగా మార్చారు. నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై గోపీ అచ్చర దర్శకత్వంలో రూపొందిన ఈ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఫిబ్రవరి 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుహాస్ మంగళవారం పాత్రికేయులతో ముచ్చటించి, సినిమా విశేషాలను పంచుకున్నారు.

### టైటిల్ మార్పు వెనుక కారణం

టైటిల్ మార్పు గురించి సుహాస్ స్పందిస్తూ.. 'భగవాన్' అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది. సెన్సార్ సభ్యుల సూచనల మేరకు సినిమా కాన్సెప్ట్‌ను, టైటిల్‌ను పరిగణనలోకి తీసుకుని 'హే బల్‌వంత్'గా మార్చాం. ఇందులో భాగంగా సీనియర్ నటుడు నరేష్ గారి క్యారెక్టర్ పేరును కూడా మార్చడం జరిగింది" అని తెలిపారు. సినిమాలో తన పాత్ర గురించి సుహాస్ వివరిస్తూ.. ఇందులో నేను చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని తపించే కుర్రాడిగా కనిపిస్తాను. తన తండ్రి చేసే బిజినెస్‌ను తను టేకాఫ్ చేయాలనుకున్నప్పుడు ఎదురైన పరిణామాలు ఏమిటి? ఆ బిజినెస్ నేపథ్యం ఏంటి? అనే అంశాలను దర్శకుడు చాలా వినోదాత్మకంగా మలిచారు. నా కెరీర్ మొదట్లో షార్ట్ ఫిలింస్‌లో చేసిన తరహా కామెడీ ఈ సినిమాలో మళ్ళీ కనిపిస్తుంది అని సుహాస్ చెప్పారు.

### వేగంగా పూర్తయిన షూటింగ్

నా కెరీర్‌లో ఓకే అయిన వెంటనే షూటింగ్ పూర్తి చేసుకుని, అతి త్వరితగతిన విడుదలకు సిద్ధమైన సినిమా ఇది. తక్కువ వర్కింగ్ డేస్‌లో పూర్తి చేసినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. మళ్ళీ నా కెరీర్‌లో ఇంత ఫాస్ట్‌గా ఒక సినిమా జరుగుతుందా? అనిపించేంత వేగంగా ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యింది అని పేర్కొన్నారు.

### సక్సెస్ పై నమ్మకం

గత సినిమాల ఫలితాలపై స్పందిస్తూ.. విజయం కోసం ఎదురుచూడటం కొంత బాధగా అనిపించినా, వెంటనే తదుపరి సినిమాకు సిద్ధమవుతాను. వరుస సినిమాల తర్వాత కొంచెం గ్యాప్ తీసుకుని, మంచి కథ కోసం వేచి చూసి ఈ సినిమా చేశాను. వంశీ నందిపాటి గారు మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నారు. మా ఆవిడ కూడా సినిమా చూసి, 'నువ్వు చేయాల్సింది ఇలాంటి సినిమాలే' అని మెచ్చుకుంది. ఈ సినిమా నాకు తప్పకుండా విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది అని ధీమా వ్యక్తం చేశారు. తమిళ చిత్రం 'మందాడి'లో తాను మెయిన్ విలన్‌గా నటిస్తున్నట్లు సుహాస్ వెల్లడించారు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' చూసి ఆ చిత్ర బృందం తనను సంప్రదించారని, ఆ సినిమాలో తన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని తెలిపారు.



## కొండగట్టు అంజన్నకు అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు

తెలంగాణలోని ప్రముఖ హనుమాన్ ఆలయంలో హీరో అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు అంజన్న ఆలయాన్ని తన కూతురు ఐశ్వర్య అర్జున్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. తాను మొదటిసారి ఈ క్షేత్రానికి వచ్చానని అర్జున్ తెలిపారు. సీతాపయనం మూవీ రిలీజ్ తర్వాత కొండగట్టుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్జున్ సర్జా మాట్లాడుతూ.. 'ఆంజనేయస్వామి ఆలయానికి రావడం అంటే నాకు చాలా ఇష్టం. కొండగట్టు చాలా సార్లు విన్నా. అందుకే మొదటిసారి ఇక్కడికి వచ్చా. ఈ ఆలయానికి రావాలని చాలా రోజులుగా అనుకుంటున్నా. సీతాపయనం మూవీ రిలీజ్ సందర్భంగా కొండగట్టుకు రావడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ మంచి జరగాలి. సర్వేజనా సుఖినోభవంతు' అని అన్నారు. కాగా.. అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన లేటేస్ట్ మూవీ సీతాపయనం. ఈ చిత్రంలో ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయన్‌గా మెప్పించింది. ఈ మూవీ ఇటీవలే వాలెంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో రిలీజైంది. ఈ చిత్రంలో అర్జున్ సర్జా కీలక పాత్రలో మెప్పించారు.

## చెక్‌బౌన్స్ కేసులో అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా క్లారిటీ



ఇప్పటికే చెక్‌బౌన్స్ కేసులో నటుడు రాజ్‌పాల్ యాదవ్ తిహార్ జైలులో ఉన్నాడు. అతడు బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యేలోపే ఇప్పుడు మరో బాలీవుడ్ నటి వివాదంలో చిక్కుకుంది. ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశంపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా హీరోయిన్ క్లారిటీ ఇచ్చింది. 2017లో నవంబర్ 16న అమీషా పటేల్ మొరాదాబాద్‌లో ఒక పెళ్లి వేడుకలో డాన్స్ చేయాల్సింది. ఇందుకుగాను అడ్వాన్స్‌గా నిర్వాహకుడు పవన్ వర్మ ఆమెకు రూ. 14.5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆమె కోసం హోటల్ రూం, ఫ్లైట్ టిక్కెట్స్ కూడా బుక్ చేశాడు. అయితే, ఆమె ఈవెంట్‌కు హాజరు కాలేదు. దీంతో నిర్వాహకుడు తనకు జరిగిన నష్టానికి తిరిగి డబ్బులు చెల్లించాల్సిందిగా అమీషాను కోరాడు. దీంతో మధ్యవర్తుల ద్వారా ఇరు పార్టీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆమె అతడికి ఆ డబ్బు చెల్లించేందుకు అంగీకరించింది. మొదట రూ. 10 లక్షలు నగదు రూపంలో చెల్లించింది. మిగతా రూ. 4.5 లక్షలకు చెక్ ఇచ్చింది. కానీ, ఆ చెక్ బౌన్స్ కావడంతో నిర్వాహకుడు వర్మ తిరిగి అమీషాపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ అంశంలో ఇప్పటివరకు ఆమె కోర్టుకు హాజరుకాకపోవడంతో అమీషా పటేల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీనిపై అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇది చాలా కాలం నాటి కేసు అని ఆమె పేర్కొన్నారు. పవన్ తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణల్ని ఎదుర్కొనేందుకు తన న్యాయవాదుల బృందం ప్రయత్నిస్తోందని క్లారిటీ ఇచ్చారు. తను ఈ అంశంలో నిర్వాహకుడికి పూర్తి డబ్బు చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే, ఎవరి వాదనలో నిజం ఉందో మరికొంతకాలం తర్వాత తేలుతుంది.